

# పర్యాటకంలో తిరుపతికి ప్రాధాన్యం



### తిరుపతి కేంద్రంగా పరిసర ప్రాంతాల అభివృద్ధి

యాంకర్ హబ్ కింద తిరుపతి కేంద్రంగా చుట్టుపక్కల ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ఏ మూల నుంచైనా సులువుగా జిల్లాలోని పర్యాటక గమ్య స్థానాలను చేరుకునేలా రోడ్డు, రైలు, విమాన ప్రయాణాలకు వీలు కల్పించనుంది. సామాన్య యాత్రికులను దృష్టిలో వుంచుకుని షటిల్ బస్సులు, రెంటల్ బైక్‌లు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించనుంది. పర్యాటక గమ్యస్థానాలు చేరే క్రమంలో మార్గాల వెంబడీ పార్కింగ్ లాట్స్, పరిశుభ్రమైన రెస్ట్ రూమ్స్, తాగునీరు, స్పష్టమైన సూచిక బోర్డులు వంటి సదుపాయాలు ఏర్పాటు చేయనుంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ కింద హైవే నిర్మాణాలు, హోటళ్లు, ఆధునిక రవాణా సదుపాయాలు వంటివి కల్పించనుంది. మరోవైపు పర్యాటక రంగం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ఆసక్తి ఉన్న యువతకు ఆతిథ్య రంగంలోనూ, హస్త కళలలోనూ, టూర్ ఆపరేషన్లలో శిక్షణ ఇవ్వనుంది.

● 2024-29 టూరిజం పాలసీ విడుదల చేసిన ప్రభుత్వం

పర్యాటకంలో జిల్లాకు, తిరుపతి నగరానికి ప్రాధాన్యం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల కాలానికిగాను (2024-29) మంగళవారం ఏపీ టూరిజం పాలసీని విడుదల చేసింది. రాష్ట్రంలో గుర్తించిన ఏడు యాంకర్ హబ్‌లలో తిరుపతికీ చోటు కల్పించారు. టెంపుల్ టూరిజం సర్క్యూట్, సీ ప్లేన్ డెస్టినేషన్లలోనూ చోటు దక్కించుకుంది. కలంకారీ చిత్రకళకు, ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్, ఏపీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. కాకుంటే, టెంపుల్ సర్క్యూట్‌లలో శ్రీకాళహస్తికి, బీచ్.. ఎకో టూరిజం సర్క్యూట్లలో జిల్లాకు మొండిచేయి చూపించింది. ఈ విషయంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నూతన టూరిజం పాలసీలో రాష్ట్రంలో ఏడు యాంకర్ హబ్‌లను ప్రభుత్వం గుర్తించింది. ఈ జాబితాలో విశాఖపట్నం, అరకులోయ, శ్రీశైలం, గండికోట, రాజమహేంద్రవరం, అమరావతితో పాటు తిరుపతికీ చోటు లభించింది. వీటిలో తిరుపతి, అరకులోయ ప్రాంతాలను స్వల్ప, మధ్యకాలిక ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. జిల్లాను ప్రధాన పర్యాటక గమ్యస్థానాలుగా గుర్తించిన ప్రభుత్వం ఇక్కడ ఒకే రంగానికి పరిమితం కాకుండా యాత్రికులకు వైవిధ్యభరిత అనుభవాన్నిచ్చేలా చర్యలు తీసుకుంటోంది. దీంతో పాటు మైస్ టూరిజం (మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్ అండ్ ఎగ్జిబిషన్స్) పరంగానూ తిరుపతిని అభివృద్ధి పరచాలని నిర్ణయించింది.

### టెంపుల్ సర్క్యూట్.. సీ ప్లేన్ డెస్టినేషన్లలో స్థానం

రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన పది టెంపుల్ టూరిజం సర్క్యూట్లలో తిరుపతికి స్థానం లభించింది. తద్వారా ఈ ప్రాంతంలోని పేరుమోసిన ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెడుతుంది. ముఖ్యంగా ఆలయాలున్న ప్రాంతాల అభివృద్ధికి డీటైల్డ్ మాస్టర్ ప్లాన్ రూపొందించనుంది. ఏడాది పొడవునా ఆయా ప్రాంతాల్లో ఉత్సవాలు, వేడుకలు నిర్వహించేందుకు వీలుగా క్యాలెండర్ రూపొందించనుంది. దీనివల్ల ఆ ప్రాంత ప్రత్యేకత రాష్ట్ర వ్యాప్తంగా తెలిసే అవకాశముంది. ఆయా ప్రాంతాలకు టూర్ ప్యాకేజీలనూ రూపొందించనుంది. ఇక, రాష్ట్రవ్యాప్తంగా సీ ప్లేన్ డెస్టినేషన్లుగా ప్రభుత్వం గుర్తించిన ఎనిమిది ప్రదేశాల్లో తిరుపతి కూడా ఉండటం విశేషం. అయితే విశాఖపట్నం, కాకినాడ వంటి చోట్ల నుంచీ సీ ప్లేన్ సర్వీసులను జిల్లాలో ఎక్కడికి నడపతారనే దానిపై పాలసీలో స్పష్టత ఇవ్వలేదు.



### కలంకారీ సావనీర్ షాపులు

హస్త కళలకు ప్రాచుర్యం కల్పించడంలో భాగంగా సావనీర్ షాపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ టూరిజం కింద వర్క్ షాపులు, ఎగ్జిబిషన్లు నిర్వహించనుంది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన హస్త కళల జాబితాలో శ్రీకాళహస్తికి చెందిన కలంకారీ పెయింటింగ్స్‌కు చోటు దక్కింది. ఇప్పటికే ప్రాచుర్యం కలిగిన కలంకారీ చిత్రకళకు తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మరింత ప్రచారాన్ని తెచ్చి పెట్టనుంది.

### కలినరీ, హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలకు ప్రాధాన్యం

పర్యాటక విధానంలో ఫుడ్ ఫెస్టివల్స్‌కు ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. ఆయా ప్రాంతాలకు ప్రత్యేకమైన ఆహార పదార్థాలు, వంటలను అందరికీ పరిచయం చేయనుంది. ఆ బాధ్యతను తిరుపతిలోని కేంద్ర పర్యాటక శాఖకు చెందిన ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్, రాష్ట్ర పర్యాటక శాఖకు చెందిన స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌పై పెట్టాలని భావిస్తోంది. వీటి ద్వారా ఏడాది పొడవునా ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహించడం, వేర్వేరు స్థాయిల హోటళ్ల నడుమ పోటీలు నిర్వహించడం, విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఆసక్తి కలిగిన యువతకు అవసరమైన శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయనుంది.



### టెంపుల్ సర్క్యూట్లలో శ్రీకాళహస్తికి దక్కని చోటు



కాగా రాష్ట్ర ప్రభుత్వం మొత్తం పది టెంపుల్ సర్క్యూట్లను ఎంపిక చేయగా అందులో పేరు ప్రఖ్యాతులున్న శ్రీకాళహస్తి లేకపోవడం గమనార్హం. పొరుగునే వున్న చిత్తూరు జిల్లా కాణిపాకం ఆలయానికి జాబితాలో స్థానం దక్కగా అంతకంటే పేరున్న శ్రీకాళహస్తిని మాత్రం పర్యాటక శాఖ విస్మరించింది. శ్రీకాళహస్తిలో ముక్కంటి ఆలయంతో పాటు చుట్టుపక్కల అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఆలయాలు అనేకం వున్నాయి. అయినా జాబితాలో ముక్కంటి క్షేత్రం లేకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.


### బీచ్ టూరిజం సర్క్యూట్లలో మొండిచేయి

బీచ్ సర్క్యూట్లుగా శ్రీకాకుళం, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం, నెల్లూరును మాత్రమే ప్రభుత్వం ఎంపిక చేసింది. 90 కిలోమీటర్ల మేర సముద్ర తీరాన్ని కలిగిన జిల్లాకు మాత్రం అవకాశం దక్కలేదు. జిల్లాలో వాకాడు, చిల్లకూరు, కోట, చిట్టమూరు, సూళ్లూరుపేట, తడ మండలాలు సముద్ర తీరాన్ని, పులికాట్ సరస్సు తీరాన్ని కలిగి ఉన్నాయి. తూపిలిపాలెం బీచ్ ఇప్పటికే రోజువారీ పెద్దసంఖ్యలో పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఆదివారాలు, సెలవు రోజుల్లో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటోంది. తూపిలిపాలెం, శ్రీనివాస సత్రం బీచ్‌లను అభివృద్ధిపరిస్తే పర్యాటకంగా జిల్లాకు గుర్తింపుతో పాటు ఆదాయం కూడా పెరుగుతుంది. పాలసీలో దీన్ని విస్మరించారు.



### ఎకో టూరిజంలోనూ అంతే

శ్రీకాకుళం-విశాఖ, తూర్పుగోదావరి-గుంటూరు, కర్నూలు-నెల్లూరు... ఈ మూడు జిల్లాలు మాత్రమే ఎకో టూరిజం సర్క్యూట్లుగా ఎంపికయ్యాయి. ఈ జాబితాలోనూ జిల్లాకు మొండి చేయి చూపించింది. వాస్తవానికి శేషాచల పర్వతాలు, వెలిగొండ పర్వతాలు, అడవులతో కూడిన జిల్లాలో ఎకో టూరిజంపరంగా తలకోన, సదాశివకోన, కైలాసకోన, ఉబ్బల మడుగు, మామండూరు వంటి అనేక ప్రదేశాలు పర్యాటక కేంద్రాలుగా గుర్తింపు పొందాయి. వీటిని ఎకో టూరిజం పరంగా అభివృద్ధి చేయడానికి గణనీయ అవకాశాలున్నాయి.



# సార్.. నిధులు కావాలి!

● అత్యవసర.. అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేసిన యంత్రాంగం

● విజయవాడలో నేడు, రేపు కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమీక్ష

జిల్లాలో అత్యవసరంగా చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అనేక ఇతర అంశాలపై జిల్లా యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వం ఎదుట ప్రతిపాదనలు ఉంచబోతోంది. నేడు, రేపు విజయవాడలో సీఎం చంద్రబాబు నాయుడు కలెక్టర్లతో నిర్వహించనున్న సమీక్షా సమావేశంలో వీటిని ప్రస్తావించనుంది. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తాను తయారు చేసుకున్న ప్రతిపాదనల జాబితాతో విజయవాడ బయలుదేరి వెళ్లారు. సీఎం ఎదుట కలెక్టర్ ప్రస్తావించనున్న అంశాలకు సంబంధించి ప్రాథమిక సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

### ■ ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రూ. 8 కోట్లు



నేలపట్టు పక్షుల అభయారణ్యం కేంద్రంగా దొరవారిసత్రంలో ఫ్లెమింగ్ ఫెస్టివల్ ఏటా జనవరిలో జరిగేది. దీనికి రాష్ట్ర నలుమూలల నుంచీ పర్యాటకులు, ప్రకృతి.. పక్షి ప్రేమికులు తరలివచ్చేవారు. గత ప్రభుత్వం ఈ ఉత్సవ నిర్వహణపై నిర్లక్ష్యం చూపడంతో నిధులు రాక ఫ్లెమింగో ఫెస్టివల్ ఆగిపోయింది. తాజాగా దీనిపై దృష్టి పెట్టిన కలెక్టర్ వచ్చే నెలలో ఫ్లెమింగో ఫెస్టివల్ ఘనంగా నిర్వహించేందుకు రూ.8 కోట్లు కేటాయించాలని యంత్రాంగం ప్రతిపాదించింది.

### కేంద్ర ప్రాజెక్టులపైనా సీఎంకు నివేదిక

వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్, సాగరమాల ప్రాజెక్టు, పీలేరు-తిరుపతి ఫోర్ లేన్ రోడ్డు, రేణిగుంట-చెన్నై ఫోర్ లేన్ రోడ్డు వంటి ప్రాజెక్టుల పనులు జరుగుతున్న తీరును సీఎంకు వివరించనున్నారు. వేగంగా పూర్తి చేయడం కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని అభ్యర్థించనున్నారు.

### పరిశ్రమల కోసం 7 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్

జిల్లాకు వరంగా మారిన చెన్నై-వైజాగ్ ఇండస్ట్రియల్ కారిడార్, చెన్నై-బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్, కృష్ణపట్నం పోర్టు, సాగరమాల వంటి ప్రాజెక్టులను అనుకూలంగా మార్చుకుని పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని యంత్రాంగం భావిస్తోంది. పరిశ్రమల ఏర్పాటుకు కీలకమైన భూముల విషయంలో ఇప్పటికే 7 వేల ఎకరాలను గుర్తించి ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేసింది. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి జిల్లాకు పరిశ్రమలను కేటాయించాలని కలెక్టర్ కోరనున్నారు.

### దెబ్బతిన్న రోడ్లకు రూ.900 కోట్లు

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రహదారుల నిర్వహణను విస్మరించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని జాతీయ రహదారుల మొదలు ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, చివరకు గ్రామీణ రోడ్లూ దారుణంగా దెబ్బతిన్నాయి. కనీసం గోతులనూ పూడ్చలేదు. భారీ వర్షాలకు జిల్లావ్యాప్తంగా పలుచోట్ల నదులు, వాగులపై వంతెనలు కూలిపోయాయి. వాటిని ఇప్పటి వరకూ పునరుద్ధరించలేదు. వీటికి తొలి ప్రాధాన్యమిచ్చిన కలెక్టర్.. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల నుంచీ సమగ్ర ప్రతిపాదనలు తయారు చేయించారు. ఆ ప్రకారం దెబ్బతిన్న రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి రూ.900 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ నిధులను కేటాయించాలని కోరనున్నారు.

### బాలాజీ, ఆల్తూరుపాడు రిజర్వాయర్ల నిర్మాణం అవసరం

జిల్లాకు సాగునీరు తెచ్చే ఏ ప్రాజెక్టులైనా నెల్లూరు జిల్లాలోనే ఉన్నాయి. ఉదాహరణకు కండలేరు నుంచే తెలుగు గంగ, స్వర్ణముఖి-సోమశిల కాలువల ద్వారా సాగునీరు జిల్లాకు వస్తోంది. తిరుపతి, తిరుమల ప్రజలు, యాత్రికుల తాగునీటి అవసరాలకూ కండలేరు రిజర్వాయర్‌పై ఆధారపడాల్సి వస్తోంది. అందుకనే రేణిగుంట మండలంలో శేషాచల పర్వత పాద భాగంలో ప్రతిపాదిత బాలాజీ... డక్కిలి మండలంలో ప్రతిపాదిత ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను తక్షణం నిర్మించాల్సిన అవసరముందని యంత్రాంగం భావిస్తోంది. ఇరిగేషన్ శాఖ రూపొందించిన అంచనాలను సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నారు.



## కుక్కను చంపిన కేసులో ఇద్దరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుక్కను చంపిన కేసులో ఇద్దరు నిందితులను తిరుపతి ఈస్ట్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ తెలిపిన ప్రకారం.. శంకర కాలనీలో ఉంటున్న లావణ్య ల్యాబ్ క్రాస్ బ్రీడ్ పెంపుడు కుక్కను మూడేళ్లుగా పెంచుకుంటున్నారు. ఈ నెల ఆరో తేదీన సొంత పనిమీద బయటకు వెళుతూ ఆమె స్కావెంజర్స్ కాలనీలోని తన మేనమామ ఆనందయ్య ఇంటి వద్ద పెంపుడు కుక్కను, కుమార్తె గ్రీష్మను వదలి వెళ్లారు. అదే రోజు సాయంత్రం స్కావెంజర్స్ కాలనీలోని శివకుమార్, అతడి సోదరుడు సాయికుమార్ కుక్క దాడి చేసిందన్న ఆగ్రహంతో ఎలాగైనా దానిని చంపేయాలని భావించారు. రెండడుగుల చెక్క, పిడి కత్తితో కుక్క గొంతుపై నరికి చంపేశారు. ఈ విషయాన్ని కుమార్తె ఫోను చేసి చెప్పడంతో.. తిరుపతి ఈస్ట్ పోలీసులకు లావణ్య ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో ఆమెకు పోలీసుల నుంచి చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఈ వ్యవహారం మీడియాలో రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులైన సాయికుమార్, శివకుమార్‌ను అరెస్టు చేశారు.



### రెవెన్యూ సదస్సుకు 1,046 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం 49 గ్రామసభలు నిర్వహించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. అందులో రీసర్వేకు 48, 22ఏకు 15, ఇంటి స్థలాలకు 249, అసైన్‌మెంట్ ల్యాండ్‌కు 73, ఆర్‌వోఆర్‌కు 507, ఇతర విషయాలకు సంబంధించి 12 చొప్పున 1,046 అర్జీలు వచ్చాయన్నారు.

## 'రోడ్డు'పైకి టీడీఆర్ అవినీతి!

● ఇంటింటికీ పది బృందాల విచారణ

● బాండ్ల విలువపై క్షుణ్ణంగా పరిశీలన

● మరోవైపు సీఐడీ దూకుడు

తిరుపతి, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వెలుగుచూసిన ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల అవినీతి వ్యవహారం రోడ్డుపైకి వచ్చింది. వైసీపీ హయాంలో వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్ల వెంబడి పది ప్రత్యేక బృందాలు తిరుగుతున్నాయి. ఇంటింటికీ వెళుతున్నాయి. రోడ్డుకు నష్టపోయిన స్థలమెంత? టీడీఆర్ బాండు విలువెంత? అన్న కోణంలో విచారిస్తున్నాయి.

ఎన్నికల వేళ మాస్టర్ ప్లాన్ రోడ్లనే ఐకాన్‌గా చూపించిన వైసీపీ పెద్దలకు టీడీఆర్ బాండ్ల జారీలో జరిగిన అవకతవకల ఉచ్చు బిగుస్తోంది. కూటమి అధికారంలోకి రాగానే టీడీఆర్ బాండ్ల వ్యవహారంపై విచారణకు ఆదేశించింది. డీఎంఏకు చేరిన నివేదికపై ప్రభుత్వ పెద్దలు అసంతృప్తి, అసహనం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. దీంతో రాష్ట్రంలోని వివిధ మున్సిపాల్టీలకు చెందిన పది మంది టౌన్ ప్లానింగ్ అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లమని రాష్ట్ర ప్రభుత్వ టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత ఆదేశాలు జారీ చేశారు. తిరుపతికి చేరుకున్న ఆ పది మంది అధికారుల్లో.. ఒక్కొక్కరికి ముగ్గురు చొప్పున తిరుపతి టౌన్ ప్లానింగ్ సెక్రటరీలను కేటాయించారు. ఒక్కో బృందానికి 40 నుంచి 45 టీడీఆర్ బాండ్లను అప్పగించి రోడ్డుకు ఒకరు చొప్పున డోర్‌డోర్ పరిశీలిస్తున్నారు.

### సీఐడీ దూకుడు

మరోవైపు సీఐడీ అధికారులూ దూకుడు పెంచారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల పరిధిలో టీడీఆర్ బాండ్లు పొంది అనుమానంగా ఉన్న కొన్ని డోర్ నెంబర్ల జాబితాను కార్పొరేషన్ రెవెన్యూ అధికారులకు వీరు ఇచ్చినట్టు తెలిసింది. వాటికి పన్నులు వేశారా? వేసుంటే ఎంతవేశారు? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈక్రమంలో సీఐడీ వాళ్లు ఇచ్చిన జాబితాలో కొన్ని డోర్ నెంబర్లు రెవెన్యూ విభాగంలో లేనట్టు తెలుస్తోంది. ఈ వారంలో సీఐడీ దర్యాప్తు కొలిక్కిరానున్నట్టు సమాచారం.

### విచారణ అధికారులు వీరే

కర్నూలు మున్సిపాల్టీ ప్లానింగ్ ఆఫీసర్ (పీవో) బి.విజయభాస్కర్, ఆదోని టీపీవో బాలమద్దయ్య బృందం కొర్లగుంట-తిరుమల బైపాస్ రోడ్డు.. రాయచోటి టీపీవో లక్ష్మీనారాయణమ్మ బృందం కొర్లగుంట.. తిరుపతి డీసీపీ మహాపాత్ర, నగరి టీపీవో మూర్తి బృందం గొల్లవానిగుంట రోడ్డు, ఒంగోలు పీవో బాబూరావు, యమ్మిగనూరు టీపీవో రాజేష్ బృందం పూలవానిగుంట, గొల్లవానిగుంట, తొండమాన్ చక్రవర్తి రోడ్డు.. బాపట్ల పీవో కాలేషా, ప్రొద్దుటూరు టీపీవో చంద్రమోహన్ బృందం డీబీఆర్ రోడ్డు.. నెల్లూరు సీపీవో హిమబిందు, గూడూరు టీపీవో నాగవల్లి బృందం అక్కారంపల్లి, కొంకా చెన్నాయగుంట రోడ్డు.. ఏలూరు పీవో సుధాకర్, వుడా టీపీపీ రేవతి బృందం కొర్లగుంట.. ఆముద పీవో సత్యమూర్తి, చిత్తూరు టీపీవో సుభప్రద బృందం చింతలచేను, గంగమ్మ ఆలయ రోడ్డు.. కడప డీటీసీపీవో ఆసిఫ్, టీపీవో రత్నరాజు బృందం కొర్లగుంట ప్రాంతం, గుంతకల్ ఏసీపీ శ్రీనివాసులు, పులివెందుల టీపీవో అజయ్‌కుమార్‌లు గెస్ట్‌లైన్, గ్రాండ్‌వరల్డ్ మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించి పరిశీలిస్తున్నారు. మరో రెండురోజుల పాటు క్షేత్రస్థాయి పరిశీలన జరగనుంది. రోడ్డుకు గిఫ్ట్‌డీడ్ ఎంత ఇచ్చారు? ఇచ్చిన స్థలానికి టీడీఆర్ బాండ్లు ఎక్కువ ఇచ్చారా? బాండ్లు ఇచ్చిన చోట రోడ్డు వేశారా? వేయకపోతే ఎందుకు వేయలేదు? వంటి వివరాలను సేకరిస్తున్నారు.

# చంద్రగిరి

## వేరుశనగలో సస్యరక్షణ చర్యలతో దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మి

రామచంద్రాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాత విధానాలను పక్కన పెట్టి రైతులు వరి, వేరుశనగ సాగులో సస్యరక్షణ చర్యలు చేప ట్టాలని వ్యవసా యశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మి కోరారు. మండలంలోని రామాపురం, బలిజపల్లి గ్రామాల్లో మంగళవారం పంట సాగుపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు పంట మార్పిడితో పాటు విధిగా భూసార పరీక్షలు నిర్వహించుకోవాలని కోరారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని సూచించారు. 3ఎఫ్ ఆయిల్‌ఫాం పంపిణీ రీజనల్ కోఆర్డినేటర్ విజయప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం పామాయిల్ సాగుకు వందశాతం సబ్సిడీ ఇవ్వడమే కాకుండా పంట సాగు నుంచి కొనుగోలు వరకు సహకరిస్తుందన్నారు. సమావేశంలో ఉద్యానశాఖ అధికారి సునీల్, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## గుండోడు కనుమ రోడ్డు సర్వే



రహదారిపై సర్వే చేస్తున్న అధికారులు

రామచంద్రాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త నెన్నూరు నుంచి తాటిమాకులకండ్రిగ వరకు ఉన్న గుండోడు కనుమ రోడ్డును మంగళవారం సర్వే చేశారు. రాయలచెరువు కట్ట కింద నెన్నూరు, గణేశ్వరపురం, కమ్మపల్లి, శాఖమూరుకండ్రిగ ప్రజలు గుండోడు కనుమ నుంచి రాయలచెరువు కట్టపై ఉన్న తాటమాకుల కండ్రిగ, మిట్టకండ్రిగ, కొత్తకండ్రిగ, పరమాలకండ్రిగ గ్రామాలకు ఎన్నో ఏళ్లగా కాలినడకన ప్రయాణం సాగిస్తున్నారు. ఆర్‌సీపురం మీదుగా కట్టపై గ్రామాలకు వెళ్లాలంటే 15 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంది. ఈ విషయాన్ని పలు గ్రామాల ప్రజలు ఎన్నికల ముందు ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవ తీసుకుని పంచాయతీరాజ్ అధికారులతో రోడ్డు వేసే లా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు గుండోడు కనుమ రోడ్డును సర్వే చేయడంతో పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్వేయర్లు రమేష్‌బాబు, మణి, టీడీపీ జిల్లా కార్యదర్శి కోరా హరిప్రసాద్, సురేంద్రనాయుడు, దినేష్ పాల్గొన్నారు.

## వరినాట్లు వేయడంలో జాగ్రత్తలు అవసరం



భాస్కరయ్య

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరినాట్లు వేయడంలో రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ వనరుల అధికారి మెరుగు భాస్కరయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని తూర్పు మండలాల్లో వరినాట్లు వేయడం ప్రారంభమైందని. రైతులు జాగ్రత్తలు పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఎకరాకు సరిపడా నారుమడికి కిలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను చల్లి నీరు పెట్టి 3-4 వారాల వరకు తెల్లచీడ, కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు చీడలను అదుపులో ఉంచవచ్చన్నారు. అలాగే వరినాట్లు వేసేందుకు సిద్ధం చేసుకున్న ఎకరా పొలానికి డీఏపీ వేసే రైతులు బస్తా డీఏపీ, 30 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్, 20:20:0 వేసేవారు దానిని 60 కిలోలు, 25 కిలోలు యూరియా వేయాలన్నారు. 10:26:26 వేసేవారు దానిని ఒక బస్తా, యూరియా ఒక బస్తా వేసుకోవాలన్నారు. 3-4 వారాలు వయసున్న లేత నార్లను వేసుకునే రైతులు నాట్లు చదరపు మీటరుకు 44 కుదుర్లు ఉండేలా పైపైనే నాటాలని సూచించారు. దీంతో కుదర్లలో పిలకలు ఎక్కువగా వస్తాయని తెలిపారు. నాటే ముందు నారు కొనలు తప్పకుండా తుంచి నాటుకోవాలని.. దీంతో నీరు కొనలో కాండం తొలిచే పురుగు పెట్టిన గుడ్లు నాశనమవుతాయన్నారు. నాటే ముందు వేసే ఎరువులతో పాటు 500 గ్రాముల చిలేటెడ్ జింక్(చిలామిన్ గోల్డ్) కలిపి వేసుకోవచ్చన్నారు. సాధారణ జింక్ సల్ఫేట్ అయితే నాటే ముందు వేసే ఎరువులకు 3 రోజుల ముందు ఎకరాకు 20 కిలోలు వేసుకోవాలని సూచించారు.

## వైభవంగా కలశ స్థాపన పూజలు



కలశ స్థాపన పూజలు చేస్తున్న పురోహితులు

భాకరాపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చినిగేపల్లెలో కట్ట కింద వెలసిన గంగమ్మ విగ్రహా విష్కరణ ఉత్సవాలలో భాగంగా రెండో రోజు మంగళవారం ఉదయం గణపతి పూజ, రిత్విక్ పూజ, కలశ స్థాపన, ప్రధాన దేవతల ఆవాహనం, గణపతి హోమం, రుద్ర హోమం చేపట్టారు. గ్రామంలో అమ్మవారి ఊరేగింపు చేపట్టారు. విగ్రహ దాత సహదేవరెడ్డి దంపతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వేడుకగా తిరువీధి ఉత్సవం



ఉభయ దేవేరులతో తిరుచ్చిపై ఊరేగుతున్న సుందరరాజస్వామి

తిరుచానూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో కొలువైన సుందర రాజస్వామికి మంగళవారం రాత్రి వేడుకగా తిరువీధి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మ నక్షత్రం ఉత్తరాభాద్ర పురస్కరించుకుని ఉత్సవర్లకు ఉదయం అత్యంత వేడుకగా అర్చకులు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం అలంకార శోభితులైన శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి వారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడవీధుల్లో ఊరేగి భక్తులను సాక్షాత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ గణేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, భాస్కర్ నాయుడు, సుబ్బరాయులు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## ఎడిఫైలో రక్తదానం




రక్తదానం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరుచానూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో ఎడిఫై విద్యాసంస్థల్లో డైరెక్టర్ ప్రణీత్ నేతృత్వంలో మంగళవారం భారీ రక్తదాన శిబిరం చేశారు. విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానికులు సుమారు వంద మందికిపైగా రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమాన మని, ప్రతిఒక్కరూ రక్తదానం చేస్తే ఆరోగ్యానికి మంచిదని ఎడిఫై విద్యాసంస్థల డైరెక్టర్ ప్రణీత్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యుత్తు తీగల చోరీ

రామచంద్రాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గంగిరెడ్డిపల్లె వ్యవసాయ పొలాల్లో సోమవారం రాత్రి ఐదుగురు రైతులకు చెందిన మోటారు స్టార్టర్లు, విద్యుత్తు తీగలు చోరీ చేసుకెళ్లారు. గంగిరెడ్డిపల్లెకు చెందిన భాస్కర్‌రెడ్డి, చంద్రారెడ్డి, పతిలేశ్వరరెడ్డి, పద్మవలిపురం గ్రామానికి చెందిన కృష్ణయ్యలకు చెందిన స్టార్టర్లు, విద్యుత్తు తీగలు చోరీకి గురయ్యాయి. నెల క్రితం గంగిరెడ్డిపల్లి , పీవీపురం, రామిరెడ్డిపల్లి రైతులకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీలను చోరీకి గురైనట్లు తెలిపారు.

## 14న సాగునీటి సంఘాల ఎన్నికలు



చంద్రగిరి మండలంలోని మూలపల్లె చెరువు

చంద్రగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని పది చెరువులకు ఈనెల 14న సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయి. ఇందు కోసం ఇరిగేషన్ అధికారులు చెరువుల ఆయకట్టు వివరాలను రెవెన్యూ అధికారులకు పంపి ఓటర్ల జాబితాకు సిద్ధం చేశారు. అయితే ఒక్కో చెరువుకు ఆరుగురు టీసీ మెంబర్లను నియమించి.. అందులో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు పదవులను ఎన్నుకోనున్నారు. ఎ.రంగంపేట వద్ద నాగపట్ల చెరువు కింద 167 ఎకరాలు, చిన్న రామాపురం వద్ద కణితమడుగు చెరువు 500 ఎకరాలు, కొండ్రెడ్డికండ్రిగ చెరువు 110 ఎకరాలు, మూలపల్లి చెరువు 250 ఎకరాలు, పుల్లయ్యగారిపల్లె వద్ద కదంకాలువ 140 ఎకరాలు, కొటాల వద్ద వెంకట్రాయుని చెరువు 116 ఎకరాలు, కల్‌రోడ్డుపల్లె వద్ద పాలేటికోన చెరువు 313 ఎకరాలు, ఆము దాలకోన ఎస్టీ కాలనీ వద్ద పోట్లకోన చెరువు 352 ఎకరాలు, అరిగిలవారిపల్లె వద్ద మాలవాని చెరువు 266 ఎకరాలు, మండపంపల్లె వద్ద జర్లకోన చెరువు 170 ఎకరాల ఆయకట్టు ఉంది. దీంతో ఇరిగేషన్ అధికారులు 14న గ్రామ సభలు నిర్వహించి డైరెక్టర్లను ఎన్నుకోనున్నారు. అనంతరం సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక జరగనుంది. సాగునీటి సంఘాలు ఎన్నికల జరిగితే చెరువులు అభివృద్ధి కానున్నాయి.

## ఇదేమి పోలీసు జులుం?



దుప్పట్లను ఎత్తుకెళుతున్న ట్రాఫిక్ పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వాళ్లు ఊరూరా పొట్టచేతబట్టుకుని తిరుగుతుంటారు. సీజనల్‌గా చిన్నాచితకా వస్తువులు అమ్ముకుంటారు. ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకుంటూ కొందరు.. చలి దుప్పట్లు, స్వెటర్లూ అమ్ముకుంటూ ఇంకొందరు.. చిన్న చిన్న బొమ్మలు, పెన్సిళ్లు, పుస్తకాలు అమ్ముతూ ఇంకొందరూ కనిపిస్తుంటారు. పేవ్‌మెంట్ల మీద, కూడళ్లలో, కాస్త జనం తిరుగులాడే తావుల్లో వీరు వ్యాపారాలు చేసుకుంటారు. ఎక్కడా స్థిరంగా ఉండరు. ఇటువంటి సంచారజీవుల మీద ప్రతాపం చూపే పోలీసులను ఏమనాలి? తిరుపతి మంగళం రోడ్డులో బొంతాలమ్మ గుడిసమీపంలో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు వీర విహారంచేశారు.ఈవలసజీవుల మీద దాడులు చేసి, వీరు అమ్ముకునే ప్లాస్టిక్ పాత్రలనీ, చలి దుప్పట్లనీ వాహనంలో వేసుకుని వెళ్లిపోయారు. వారంతా నెత్తీనోరూ బాదుకుంటున్నా లెక్క చేయలేదు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించడానికి కఠినంగా ఉండక తప్పదని బహుశా పోలీసు బాసులు సమర్థించుకోవచ్చు కానీ, తిరుపతి నగరంలో ఎక్కడబడితే అక్కడ ప్లాట్‌ఫారాలు ఆక్రమించుకుని నిర్మాణాలు కూడా చేసేసుకుని స్థిరవ్యాపారాలు చేసుకుంటున్న వారి జోలికి ఎందుకు వెళ్లడం లేదు సాములాలా...? అని అడిగితే ఏం సమాధానం చెబుతారో! తిరుమల బైపాస్ రోడ్డులో పార్కింగ్ లేకుండా నిర్మించుకున్నపెద్దపెద్ద హోటళ్ల వద్ద ట్రాఫిక్ ఎంత క్లిష్టంగా మారుతోందో ఏనాడైనా పట్టించుకోని వారు పేదవలస జీవుల మీదనా ప్రతాపం చూపేది? ప్లాట్‌ఫారాల మీద టిఫిన్ బండ్లు పెట్టుకున్నవారి మీదా, కూరగాయలు అమ్ముకునే వారిమీదా చీటికిమాటికి విరుచుకుపడతారు. నిజానికిబీదాబిక్కీ జనానికి చవగ్గా తిండి దొరికేది ఇటువంటి బండ్ల దగ్గరే. నిబంధనలు నిజమేగానీ అవి అందరికీ ఒకేలా ఎందుకుండవో!కాస్త మానవత్వంతో డ్యూటీలు చేస్తే పేదలు కూడా బతుకుతారు సార్లూ.

## టీడీపీతోనే స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధ్యం



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

రామచంద్రాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధ్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద స్వచ్ఛభారత్ నిధులతో నెత్తకుప్పం, కుప్పం బాదూరు, దేశూరికండ్రిగ, రామా పురం గ్రామ పంచాయ తీలకు ఆయన ట్రాక్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విధించిన చెత్తపన్ను రద్దు చేసి చెత్త సంపద కేంద్రాలను పునరుద్ధరించామన్నారు. నియోజక వర్గంలోని పలు గ్రామాల్లో మురుగునీటి కాలువలను ఏర్పాటు చేస్తున్నా మన్నారు. చెత్త సేకరణ సక్రమంగా జరుగుతోందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు పంచాయతీలకు నిధులు అందజేస్తున్నారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు కేశవులునాయుడు, చిన్నబాబు, ఉమాపతినాయుడు, విజయకుమార్, హరిప్రసాద్, నరసింహారెడ్డి, జేడీ జగన్, సురేంద్రనాయుడు, ఢిల్లినా థరెడ్డి, నాయకులు మునిరామిరెడ్డి, దినేష్, జీవరత్నం, మాధవయ్య పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారానికే 'మీ భూమి-మీ హక్కు'

పాకాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం 'మీ భూమి-మీ హక్కు' రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మండలంలోని వల్లివేడులో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం.. అభివృద్ధి కార్యక్రమా లతో పాటు ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వం చేపట్టిందన్నారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో వినతులు ఇస్తే మూడు నెలల్లో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుం టామ న్నారు. ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు, తహశీల్దారు నిత్యానంద బాబు, ఎంపీడీవో అరుణ, ఈవో పీఆర్డీ శశిరేఖ, ఎంపీటీసీ వరాల రెడ్డి, నాయకులు సతీష్, అమరనాథరెడ్డి, శివారెడ్డి, ప్రకాష్, వివి.చౌదరి, చంద్రబాబు, మధునాయుడు, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

● భాకరాపేట: యువత కోసం క్రీడా మైదానానికి స్థలం కేటాయించాలని భాకరాపేటకు చెందిన యువత రెవెన్యూ సదస్సులో వినతి పత్రం అందించారు. భాకరాపేటలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యుటేషన్, పట్టాదారు పాసుపుస్తకాల మార్పులు, భూసర్వే, ఇళ్ల స్థలాలు వంటి సమస్యలపై 35 అర్జీలు అందించారు. కార్యక్రమంలో తహశీల్దారు జనార్దన్ రాజు, డీటీ వాసుదేవ కుమార్, ఆర్‌ఐ జానకిరామ్, వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్లు గణేశ్, కేశవులు, సర్పంచ్ భూపాల్, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, వైఎస్ ఎంపీపీ సునీత, టీడీపీ నేతలు దామోదర్, లోకనాథం, వెంకటరత్నం, సుబ్రహ్మణ్యం, శ్రీధర్ రాయల్, తులసీ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

● చంద్రగిరి: భూ సమస్యలు పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహశీల్దారు శివరామసుబ్బయ్య అన్నారు. చంద్రగిరి మండలంలో అగరాల, ఐతేపల్లె పంచాయతీలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు శివరామసుబ్బయ్య ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. సర్పంచులు తుకాకుల భాస్కర్‌రెడ్డి, షేక్ ఫజిల్లా, ఎంపీటీసీ ఏసీ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

● తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దారు రామాంజులునాయక్ గ్రామస్తుల నుంచి 60 అర్జీలు స్వీకరించారు. సర్పంచ్ మొక్కల భారతి, అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## యాత్రికులకు భద్రత కలేనా..!



శ్రీనివాసం ఎదుట రోడ్డు దాటుతున్న యాత్రికులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసం, మాధవం విశ్రాంతి భవన సముదాయాల ముందు యాత్రికులకు ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన కొందరు స్థానికులు ఎన్నో ఏళ్లుగా అటు టీటీడీ ఇటు నగరపాలక సంస్థల దృష్టికి తీసుకొస్తున్నా నిర్లక్ష్యంగా ఉంటున్నారు. సమస్య పరిష్కార మార్గాలపై చర్యలు చేపట్టడం లేదు. రోజూ శ్రీనివాసంలో బసచేసిన వేలాది మంది భక్తులు రోడ్డుదాటే సమయంలో ప్రాణగండం నుంచి బయటపడినట్లు అనిపిస్తోంది. మంగళవారం ఉదయం ఉత్తరాది యాత్రికుల బృందం సుమారు 50 మంది శ్రీనివాసం నుంచి ఆర్టీసీ బస్టాండుకు చేరుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. వాహనాల రద్దీ కారణంగా చాలా సమయం వేచి ఉండి సగం రోడ్డు దాటుకున్నారు. చీమలదండులా వాహనాల రాకపోకలు జరుగుతుండటంతో గరుడ వారధి పిల్లర్ చాటున కాసేపు వేచి ఉన్నారు. ఆ తరువాత సగం రోడ్డు దాటేందుకు మరికొంత సమయం వేచి ఉన్నారు. వాహనాలు వస్తూనే ఉండటంతో ఆ బృందంలో ఒకరు ధైర్యం చేసి రోడ్డుకు అడ్డుగా నిలబడి వాహనాలను ఆపారు. దీంతో బృందం సభ్యులందరూ ఒక్కసారిగా పరుగందుకొని రోడ్డు దాటారు. వృద్ధులు కంగారుపడుతూ దాటుతుండటం బాధాకరం. ఇకనైనా టీటీడీ, నగరపాలక సంస్థ అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## పాఠాలు బోధించకుండా పరీక్షలెలా రాయాలి?

### గిరిజన గురుకులం విద్యార్థుల ఆవేదన

రేణిగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాఠాలు బోధించకుండా పరీక్షలెలా రాయలని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. తిరుపతి విమానాశ్రయం సమీపంలో ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాల నడు స్తోంది. ఈ పాఠశాలలో ఐదో తరగతి నుంచి టెన్త్ వరకు సుమారు 369 మంది విద్యార్థులు న్నారు. అయితే అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు తమ జీతాలు పెంచాలని గతనెల 19వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారు. ఇం దులో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న 15మంది ఉపాధ్యాయులు సమ్మెలో పాల్గొంటున్నారు. దీంతో ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే అన్ని తరగతులకు బోధించాల్సిన పరిస్థితి. ప్రధానంగా గణితం, సైన్స్ సబ్జెక్టుల బోధన నిలిచిపోయింది. సిలబస్ పూర్తి కాకుండా మరో మూడు నెలల్లో జరిగే పబ్లిక్ పరీక్షలెలా రాయాలని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై గిరిజన ఉపాధ్యాయ అసోసియేషన్ నాయకుడు పురుషోత్తంను వివరణ కోరగా.. తామంతా 15ఏళ్లుగా అవుట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్నా ఇప్పటికీ 2010 లెక్క ప్రకారమే జీతాలు చెల్లిస్తున్నారని తెలి పారు. తమ పరిధిలోనే ఉన్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు అధిక మొత్తంలో జీతాలు చెల్లిస్తున్నారని చెప్పారు. తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా 1650 మంది సమ్మెలో పాల్గొంటున్నారని తెలిపారు. తమ సమ్మెవల్ల విద్యార్థులకు బోధన నిలిచిపోయిన విషయమై ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

## అన్నదాతలకు అండగా ఉంటాం: భూమన

తిరుపతి (జీవకోన), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందని, అన్నదాతలకు తమ పార్టీ అండగా ఉంటుందని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి అన్నారు. ఈ నెల 13వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్‌ల వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి సంబంధించి గోడ పత్రికలను ఆయన నివాసం వద్ద మంగళవారం ఆవిష్కరించారు. కేవలం పవన్ కళ్యాణ్‌ను బుజ్జగించడానికే నాగబాబుకు మంత్రి పదవి ఇస్తానని చంద్రబాబు చెప్పినట్లు తెలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, తిరుపతి వైసీపీ సమన్వయకర్త భూమన అభినయ రెడ్డి, నాయకులు అజయ్ కుమార్, బొమ్మగుంట రవి తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు సర్దుబాటు చార్జీల భారం దారుణం

పాకాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరెంటు సర్దు బాటు చార్జీల భారాన్ని ప్రజలపై మోపడం దారుణమని సీఐ టీయూ జిల్లా కార్యదర్శి జయ చంద్ర అన్నారు. మంగళ వారం సీఐటీయూ భవనంలో జరిగిన కార్మిక సంఘాల సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి నాయకులు కరెంటు చార్జీలు పెంచబోమని .. తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లు పెట్టమని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక హామీలు విస్మరించడం తగదన్నారు. స్మార్ట్ మీటర్లు, విద్యుత్తు ఒప్పందాలకు వ్యతిరేకంగా హైకోర్టులో కేసులు వేశామన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షురాలు హేమలత, సీఐటీయూ జిల్లా నాయకులు చిన బాబు, మధుసూదన్‌రావు, మండల కన్వీనర్ ప్రసాద్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వ్యభిచారం కేసులో ముగ్గురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వ్యభిచారం నిర్వహిస్తున్న లాడ్జిపై మంగళవారం పోలీసులు దాడులుచేసి ముగ్గురు నిర్వాహకులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1000 స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఈస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు... నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం డేగపూడి గ్రామానికి చెందిన కోడూరు గోవర్ధనరెడ్డి, శ్రీకాళహస్తికి చెందిన గుడాల గురవయ్య, నెల్లూరు జిల్లా అనంతమడుగు నివాసి మద్దాలి వెంకటేశ్వర్లు వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు స్థానిక జయశ్యామ్ రోడ్డులోని పీజీఆర్ రెసిడెన్సీలో గది అద్దెకు తీసుకున్నారు. ముందుగా ఈస్ట్ సీఐకి అందిన సమాచారం మేరకు ఎస్ఐ, సిబ్బందితో కలసి లాడ్జిలో తనిఖీలు చేశారు. ఆ సమయంలో లాడ్జి లీజు యజమాని గురవయ్య సహకారంతో మహిళను ఉంచి ఎవరికీ అనుమానం రాకుండా వ్యభిచారం నిర్వహిస్తూ డబ్బు సంపాదిస్తున్నట్లు బయటపడింది. నిర్వాహకుడు కోడూరు గోవర్ధనరెడ్డి, లీజు యజమాని గురవయ్య, విటుడు వెంకటేశ్వర్లును అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. గోవర్ధనరెడ్డి నుంచి రూ.1000 స్వాధీనం చేసుకున్నామన్నారు.

## ఏడు గంగమ్మలకు ముక్కంటి సారె

శ్రీకాళహస్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో మంగళవారం ఏడు గంగమ్మలకు ముక్కంటి సారెను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అందజేశారు. ఆలయంలోని అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సారెనుఆలయంలోని శివయ్య గోపురం, రాజగోపురం నుంచి తేరువీధి, నెహ్రూవీధి, ముత్యాలమ్మ గుడివీధి మీదుగా ఏడుగంగమ్మలకు సారె సమర్పించారు.

## సూరప్పకశంలో 17 మంది పింఛను అనర్హుల గుర్తింపు

రేణిగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సూరప్పకశం పంచాయతీలో 17 మంది పింఛను లబ్ధిదారులను అనర్హులుగా గుర్తించినట్లు డీఆర్డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. 18 మంది సచివాలయ సిబ్బంది తొమ్మిది బృందాలుగా ఏర్పడి రెండు రోజులపాటు విచారణ జరపగా 17మంది అనర్హులున్నట్టు గుర్తించారు.

## సి.మల్లవరంలో నిధుల దుర్వినియోగంపై విచారణ



గొడవ పడుతున్న రెండు వర్గాలు

తిరుపతిరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఫిర్యాదుపై డీఎల్‌పీవో సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన విచారణ రసాభాసగా మారింది. గత ప్రభుత్వంలో కొళాయి కనెక్షన్ల మంజూరు, ఇళ్ల అనుమతులు, వాటర్‌ప్లాంట్ నిర్వహణ, అనర్హులకు పింఛన్లు, పంచాయతీనిధులకు సంబంధించి అనేక అవకతవకలు జరిగాయని కాలూరుకి చెందిన నవీన్‌బాబు గత నెల18న కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలమేరకు మంగళవారం ఉదయం డీఎల్‌పీవో విచారణ చేపట్టారు. సర్పంచి మొక్కల భారతి, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు మనోహర్‌చౌదరి, ఫిర్యాదుదారు నవీన్ బాబుతోపాటు వారి అనుచరులు ఎక్కువసంఖ్యలో వచ్చారు. దీంతో ఇరువర్గాల మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు ఆరోపణలు, దూషణలకి దిగారు. ఎవరూ వ్యక్తిగత దూషణలు చేసుకోవద్దని, చెప్పదలచుకున్న విషయాన్ని రాతపూర్వకంగా అందిస్తే పరిశీలిస్తానని డీఎల్పీవో చెప్పారు. గొడవ విషయం తెలిసి ఎంఆర్‌పల్లె పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గొడవలకి దిగితే సుమోటోగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో ఇరువర్గాలు మిన్నకుండిపోయారు. విచారణలో భాగంగా సర్పంచ్ భారతి, ఫిర్యాదుదారుడు, పంచాయతీ పారిశుధ్య సిబ్బంది, గ్రామస్తుల నుంచి వివరాలని సేకరించారు. అర్జీరూపంలో రాతపూర్వకంగా డీఎల్‌పీవోకి అందించారు. పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరగలేదని, నిబంధనల ప్రకారమే ఇళ్ల నిర్మాణాలకి అనుమతులు, కొళాయి కనెక్షన్లు ఇచ్చామని సర్పంచి తెలిపారు. పంచాయతీలోని ప్రభుత్వస్థలాల్లో ఆక్రమణలను అడ్డుకున్నందుకే తనపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. డీఎల్పీవో విచారణకు తనను రానీయకుండా దౌర్జన్యంతో అడ్డుకున్నారని, తాను ఫిర్యాదు చేసిన అంశాలలో రూ.కోటివరకు దుర్వినియోగం జరిగిందని నవీన్‌బాబు ఆరోపించారు. కొళాయి కనెక్షన్లకు డబ్బులు కట్టించుకుని చలానాలు ఇవ్వలేదని, సీసీరోడ్లు, భవననిర్మాణ పనుల్లో అవకతవకలు జరిగాయన్నారు. కాగా, గతంలో పంచాయతీలో చేపట్టిన పనులతోపాటు ఫిర్యాదులోని అంశాలకు సంబంధించి రికార్డులను సమర్పించాలని కార్యదర్శి శివకుమార్‌ని డీఎల్పీవో ఆదేశించారు. వీటిని పరిశీలించి కలెక్టర్‌కి నివేదిస్తానని ఆయన మీడియాకు చెప్పారు.



## చంటిబిడ్డతో టక్కు... టక్కు...!

రెక్కాడితే కాని డొక్కాడని నేపథ్యంలో ఓ తల్లి చంటి బిడ్డనేమో ఒడిలో, మరో బిడ్డనేమో పక్కనే కూర్చోబెట్టుకొని తమ చేతి వృత్తి అయిన రుబ్బురోళ్లను తయారు చేస్తోంది. కొర్లగుంట మెయిన్ జంక్షన్ వద్ద మంగళవారం ఈ దృశ్యం కనిపించింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

# నా ఫిర్యాదునే మరణవాంగ్మూలంగా భావించండి!

### దివంగత మాజీ ఏఎస్పీ కుమార్తె మూడేళ్ల గోడు





ఉరుస్తుండటంతో ఊడిపోయిన సీలింగ్

"మా ఫ్లాట్ కారుతోంది. పైకప్పు రాలుతోంది. సీలింగ్ ఊడిపోయింది. గోడలు చెమ్మబారి పోయాయి. కరెంటు షార్ట్ సర్క్యూట్ అవుతోంది. ఏదైనా ప్రమాదం జరిగి ఇంట్లో నేను మరణిస్తే ఈఫిర్యాదునే మరణ వాంగ్మూలంగా భావించండి.." అంటూ ఒక మహిళ తిరుపతి కార్పొరేషన్ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు తమ అపార్ట్‌మెంట్‌లో ఉండే మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధికారి ఒకరు కారణమని ఆమె పేర్కొన్నారు. "మా అపార్ట్‌మెంట్ పైన రూఫ్ గార్డెన్ పెట్టారు. దానికోసం రంధ్రాలు వేశారు. దీంతో లోపలికి నీళ్లు కారుతున్నాయి. సీలింగ్ ఊడిపోతోంది. గోడలు పాడవుతున్నాయి. చెమ్మకి గోడలు షార్ట్ సర్క్యూట్ అవుతున్నాయి. నా ప్రాణాలకు ప్రమాదం ఉంది" అని తిరుపతి డీఆర్ మహల్ సమీపంలోని గ్రీన్‌పార్క్ అపార్ట్‌మెంటు 7వ బ్లాక్‌లో ఐదో ఫ్లోర్‌లో నివాసం ఉంటున్న దేవిక గోడుగోడుమంటున్నారు. అది ఆమె సొంత ఫ్లాట్. 13 ఏళ్లుగా కాపురం ఉంటున్నారు. మూడేళ్లుగా ఈ ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని దేవిక చెబుతున్నారు. దీని మీద ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. తిరుపతి నగరపాలక సంస్థలో డీఈగా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఒక అధికారివల్ల ఇలా జరుగుతోందంటూ ఆమె సోమవారం తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. 'కార్పొరేషన్ వాళ్లేమో పోలీసులకు ఫిర్యాదు చేయమంటున్నారు. పోలీసులేమో కార్పొరేషన్‌లో ఫిర్యాదు చేయమంటున్నారు. నా బాధ ఎవరికి చెప్పుకోవాలి?' అని ప్రశ్నిస్తున్నారు. నా ఇల్లు పాడైపోతోంది, ప్రమాదం అని అడిగినందుకు బిల్డర్ సహా, తమ అపార్ట్‌మెంట్‌లో ఉండే అప్పటి మున్సిపల్ అధికారి తన పట్ల దౌర్జన్యంగా వ్యవహరించారని తెలిపారు. 'ఉండలేకపోతే, ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపో' అని బెదిరిస్తున్నారని దేవిక తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మున్సిపల్ అధికారి కావడంతో ఎవరూ పట్టించుకోలేదన్నారు. అధికార, రాజకీయ బలంతో మూడేళ్లుగా తనను దబాయిస్తున్నారని అన్నారు. 'ప్రభుత్వం మారింది. అధికారులు మారారు. ఇప్పుడైనా నా గోడు పట్టించుకోండి. నాప్రాణం పోకుండా కాపాడండి' అని ఆమె ఆవేదనగా చెప్పారు. దివంగత మాజీ అదనపు ఎస్పీ ఎస్.సుబ్బరాయులు కుమార్తె అయిన దేవిక తనకు న్యాయం చేయండి అంటూ పోలీసులనూ, మునిసిపల్ అధికారులనూ మూడేళ్లుగా వేడుకుంటూ ఉండటమే విచిత్రం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

# టెండర్‌దారులకు దుకాణాల వివరాలు అందిస్తాం

తిరుపతి(వైద్యం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలోని దుకాణాల టెండర్‌లో పాల్గొనేందుకు వచ్చే వారికి ఆ దుకాణాలకు సంబంధించిన పూర్తి వివరాలతో కరపత్రాలను అందిస్తామని సూపరింటెండెంట్ రవిప్రభు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాల టెండరు నోటీసు స్పష్టత లేకుండా విడుదల చేసిన విషయంపై ఆంధ్రజ్యోతిలో మంగళవారం రుయాలో గందరగోళంగా టెండర్ శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ హెచ్‌డీఎస్ కమిటీ సమావేశంలో కమిటీ సభ్యుల సమక్షంలోనే దుకాణాల టెండరు విషయంపై పూర్తి స్థాయిలో చర్చించి ఆ మేరకే నోటీసు విడుదల చేశామన్నారు. నోటీసులో పూర్తి వివరాలతో కూడిన సమాచారం ఇవ్వకపోవడం వాస్తవమేనని, టెండరులో పాల్గొనదలిచిన వారు కార్యాలయానికి వస్తే వాటికి సంబంధించిన సమాచారం తెలియజేస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కరపత్రాలను కూడా సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు.

## 13నుంచి 'మనసు పరిమళించేనే'



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న తిరుపతి ఫిలింసొసైటీ సభ్యులు

తిరుపతి(జీవకోన), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల13 నుంచి 15వ తేదీ వరకు మూడు రోజులపాటు మహతి కళాక్షేత్రంలో గాన గంధర్వుడు ఘంటసాల 102వ జయంతిని పురస్కరించుకుని మనసు పరిమళించేనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సొసైటీ ఛైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఘంటసాల పాడిన పాటలను, పద్యాలను శ్రోతలకు వినిపించేందుకు ప్రముఖ గాయనీ, గాయకుల చేత ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో అధ్యక్షులు వై.ఎస్.బాబు, కోశాధికారి ప్రసాద్‌రావు, వైస్ ప్రెసిడెంట్ బుజ్జిబాబు నాయుడు, సుబ్రహ్మణ్యం, శాంతావాణి, అనసూయ, భాస్కర్, గుల్జార్, మేరీజాయ్ తదితరులు పాల్గొన్నారు.

## యానిమల్ యాక్ట్ ప్రకారం నిందితులను శిక్షించాలి



మీడియాతో మాట్లాడుతున్న దివ్యరెడ్డి, లావణ్య

తిరుపతి(జీవకోన), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని స్కావెంజర్స్‌కాలనీ వద్ద నాలుగు రోజుల క్రితం టామీ అనే కుక్క పిల్లను కత్తితో నరికి చంపిన వారిని అనిమల్ యాక్ట్ ప్రకారం కఠినంగా శిక్షించాలని హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ యానిమల్స్ ఛైర్మన్ దివ్యరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ మూడు సంవత్సరాల వయస్సు గల టామీ (కుక్క)ని ఇంట్లో పెద్దవారు ఎవరూ లేని సమయంలో కత్తితో అతిదారుణంగా చంపారని ఆరోపించారు. దీనిని హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ అనిమల్స్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. బాధితురాలు లావణ్య మాట్లాడుతూ తాము ఇంట్లో లేని సమయంలో కుక్క మొరిగిందని కోపం పెంచుకుని చిన్నారులు మాత్రమే ఇంట్లో ఉన్న సమయాన్ని చూసుకుని టామీని దారుణంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా రాజీ చేసుకోవాలని సూచిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్‌కు జడ్ కేటగిరి, వీవీఐపీ భద్రత కల్పించాలి

### జనసేన పార్టీ నగరాధ్యక్షుడు రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి, తదితరులు

తిరుపతి (జీవకోన), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి తరహాలో జడ్ క్యాటగిరి, వీవీఐపీ భద్రత ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల డిప్యూటీ సీఎంను హతమార్చేందుకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి మెసేజ్‌లు రావడం పట్ల తీవ్ర స్థాయిలో స్పందించారు. ఆయనకు గట్టి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, దీనిపై వెంటనే స్పందించి జడ్‌ప్లస్ కేటగిరి, వీవీఐపీ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుబాబు మాట్లాడుతూ ప్రజాదరణ కలిగిన నాయకుడైన పవన్‌కళ్యాణ్‌పై వైసీపీ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. సమావేశంలో బాబ్జి, వినోద్‌రాయల్, మునస్వామి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## బేస్‌బాల్ పోటీలకు ముగ్గురి ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తిరుపతి (క్రీడలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19తేదీ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో జరగనున్న జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు మంగళం జడ్పీ ట్రెండ్స్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలలో గెలుపొందిన జట్టులో ఈ ముగ్గురు చోటు దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆ ముగ్గురుని ప్రధానోపాధ్యాయులు కేశవుల నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు రామకృష్ణ, సాంబశివరావు తదితరులు అభినందించారు. జాతీయస్థాయిలోనూ రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## చాగంటి నియామకంపై విమర్శలు మానుకోవాలి : ఆపస్

తిరుపతి(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారుగా నియమించడాన్ని విమర్శించడం మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నాయకులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చాగంటి నియామకం చాలా మంచి నిర్ణయమని సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగై డ్రగ్స్ కల్చర్ పెరిగిపోతూ సమాజంలో అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోతున్న తరుణంలో విద్యార్థి దశ నుంచే నైతిక విలువలను పెంపొందించేందుకు చాగంటిని నియమించి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇకపై ఒక గంట సమయం నైతిక విలువల గురించి విద్యార్థులకు చాగంటితో బోధింపజేయాలని, ఆయన ప్రవచనాలను వర్చువల్‌గా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

## మోహన్‌బాబు యూనివర్సిటీ బౌన్సర్లను అరెస్ట్ చేయండి

తిరుపతి(ఆటోనగర్), డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల క్రితం చంద్రగిరి మండలంలోని మోహన్‌బాబు యూనివర్సిటీ ఎదుట వున్న రోడ్డుపై విజువల్స్ తీసుకొంటున్న టీవీ జర్నలిస్ట్‌లపై బౌన్సర్లు దాడులు చేయడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. దాడులు చేసిన బౌన్సర్లను వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మోహన్‌బాబు ఆస్తి గొడవలు ఎక్కడ బయటపడతాయోనని ఇలా దాడులకు పాల్పడటం అప్రజాస్వామికమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలనిఆయన డిమాండ్ చేశారు.

## ఆర్టీసీ ఉద్యోగికి తెలుగుతేజం అవార్డు



ఆర్టీసీ ఉద్యోగికి అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం మార్కాపురం మండల కేంద్రంలో ఆదరణ సేవాసంస్థ ఆధ్వర్యంలో కవిసమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వైభవం, తెలుగు భాషా ఔన్నత్యం, తెలుగు శతాధిక కవులను ఆదర్శంగా తీసుకొని తిరుపతికిచెందిన ఆర్టీసీ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ గుండ్లూరు సుబ్రహ్మణ్యం 'పంచకట్టు, రుమాలుకట్టు, నడుముకట్టులపై తెలుగువాడు' అనే అంశాలను రచించి కవితాగానంతో అతిథులను మెప్పించారు. వినసొంపైన స్వరంతో గద్దర్‌ను తలపిస్తూ సభికులను ఆకట్టుకున్నారంటూ అతిథులు అభినందించారు. అనంతరం ఆదరణ సంస్థ వ్యవస్థాపకులు చెన్నకేశవులు, తెలంగాణ హైకోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పి.వి.పి.అంజనీకుమారి, వేటపాళెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నారాయణస్వామి సంయుక్తంగా గుండ్లూరు సుబ్రహ్మణ్యంకు తెలుగుతేజం అవార్డు ప్రదానం చేసి శాలువకప్పి ఘనంగా సత్కరించారు.

# ఘనంగా మానవ హక్కుల దినోత్సవం






కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్వీయూ వీసీ అప్పారావు - కార్యక్రమంలో మాట్లాడుతున్న రిటైర్డు జడ్జి గుర్రప్ప

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో మంగళవారం మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్వీయూ హ్యూమన్ రైట్స్ విభాగం ఆధ్వర్యంలో సెనేట్ హాల్లో సభ నిర్వహించారు. ఇందులో వీసీ అప్పారావు, డీన్ మురళీధర్, ప్రిన్సిపాల్ సుధారాణి, వివేక్, హరికృష్ణ, రంజిత్, రవిబాబు, శ్రీధర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు. హక్కులు పటిష్ఠంగా అమలయ్యేలా చూడాలన్నారు. హక్కుల గురించి ఈ తరం వివరంగా తెలుసుకోవాలని కోరారు. ● పద్మావతి యూనివర్సిటీలోని అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డు జడ్జి గుర్రప్ప, ప్రొఫెసర్లు తవితాతులసి, లలితకుమారి పాల్గొని మాట్లాడారు. మహిళలు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని వారు సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజేశ్వరీమూర్తి 103వ జన్మదిన వేడుకలు



సభలో మాట్లాడుతున్న ప్రేమావతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పద్మావతి డిగ్రీ కాలేజీ రిటైర్డు ప్రిన్సిపాల్ రాజేశ్వరీమూర్తి 103వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాలేజీలో మంగళవారం కేక్ కట్ చేశారు. కాలేజీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన వారు రాజేశ్వరీమూర్తి అని రిటైర్డు లెక్చరర్ ప్రేమావతి కొనియాడారు. విద్యార్థులతో ఆమె చాలా ఆత్మీయంగా మెలిగే వారని టీటీడీ పీఆర్వో నీలిమ చెప్పారు. రాజేశ్వరీమూర్తి ఆదర్శనీయులని పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు వసుధ, ఆమె కృషి స్ఫూర్తిదాయకమైనదని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భద్రమణి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేడుకగా సాయిబాబా ఊరేగింపు

తిరుపతి అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కొంకావీధిలోని సాయిబాబా మందిరంలో 23వ వార్షిక వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయినాథుడికి ప్రత్యేక అభిషేకం, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. మధ్యాహ్నం పెద్ద సంఖ్యలో అన్నదానం నిర్వహించారు. రాత్రి సాయిబాబా చిత్రపటంతో ఊరేగింపులో భాగంగా 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ద్వారకామయి శిరిడీసాయిబాబా సేవా సమాజ్ ప్రతినిధులు ముబ్బు దేవనారాయణరెడ్డి, కుడితి సుబ్రహ్మణ్యం, దుర్గం శ్రీనివాస్, శివ, రమేష్, విజయలక్ష్మి, శ్రీను, హరిబాబు, ప్రభాకర్, బాలకృష్ణ, కళావతి, రాణి తదితరులు పాల్గొన్నారు.

## మానవ హక్కులపై అవగాహన అవసరం

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బాల్యం నుంచే మానవ హక్కులపై అవగాహన కల్పించాలని, హక్కుల ఉల్లంఘన మానవతకు వ్యతిరేకమని సోషల్ డెవలప్‌మెంట్ సొసైటీ, విన్స్ సంస్థల నిర్వాహకులు మీరా, న్యాయవాది శ్రావణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధనం పేర్కొన్నారు. రేణిగుంట బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం సోషల్ డెవలప్‌మెంట్ సొసైటీ, విన్స్ సంస్థలు సంయుక్తంగా విద్యార్థినులకు మానవహక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో నేటికీ నెలకొన్న లింగవివక్షతను పారదోలేందుకు తమ సంస్థలు చేస్తున్న అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్న అంశాలపై పోస్టర్ మేకింగ్ చిత్రపటాల ద్వారా ఆర్టిస్ట్ బి.కిరణ్‌కుమారి విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

## నజీర్‌ఖాన్‌కు జీవితసాఫల్య పురస్కారం




పురస్కారం అందుకుంటున్న నజీర్‌ఖాన్

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ప్రపంచ మానవ హక్కుల 76వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రపంచ మానవ హక్కుల మండలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.నజీర్‌ఖాన్‌కు ఆసంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎం.ఆర్.అన్సారీ జీవితసాఫల్య పురస్కారం అవార్డును అందజేశారు. గతంలో ఆయన తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఐఆర్‌సీటీసీ ఏరియా ఆఫీసర్‌గా సేవలందించారు.

## నడివీధి గంగమ్మకు పొంగళ్లు



పొంగళ్లు కార్యక్రమంలో పాల్గొన్న నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక 36 డివిజన్ టీనగర్‌లోని నడివీధి గంగమ్మకు మంగళవారం భక్తులు ఘనంగా పొంగళ్లు సమర్పించారు. ఆలయాన్ని వేపాకులతో అలంకరించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, చిత్తూరు రవిశంకర్ యాదవ్, మహేష్ యాదవ్, ఆవుల శంకర్ యాదవ్, జనసేన నాయకులు వినోద్ రాయల్, ఆముదాల వెంకటేష్, ఆవుల శ్రీనివాస్ యాదవ్, ప్రేమ్, ముని, అబ్దుల్లా, ఉపేంద్ర, మధుసూదన్ యాదవ్, మహిళా భక్తులు భారతి, వరలక్ష్మి, శ్రీలక్ష్మి, మునిలక్ష్మి, విజయలక్ష్మి, నీరజలు పాల్గొని భక్తులకు అంబలి ప్రసాదాన్ని వితరణ చేశారు.

## ఘనంగా నడివీధి గంగమ్మ జాతర



పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు, టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ భువన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి(జీవకోన), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఆకుతోటవీధి, పంటవీధిలో ఉన్న నడివీధి గంగమ్మ జాతర మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ నాయకులు, తిరుపతి కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ భువన్‌కుమార్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అంబలి పంపిణీ చేశారు. స్థానిక మహిళలంతా భక్తిశ్రద్ధలతో అంబలిపోసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు వెంకట్, రమేష్‌రెడ్డి, లచ్చి, నెల్లూరు బాబు, యతి, సురేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, వీఆర్.సురేష్, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నర్సింగ్ సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ సభ్యులు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేసే నర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఏపీ జేఏసీ జిల్లా ఛైర్మన్ ఎస్.సురేష్‌బాబు, ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధా తదితరులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. హాస్పటల్‌లో నర్సింగ్, మెడికల్ అసోసియేషన్ క్యాంటీన్లను కొనసాగించాలని కలెక్టర్‌ను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గిరిబాబు, లీలా, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## స్కూటర్ ఢీకొని ఆవు మృతి



తిరుపతి(జీవకోన), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని కరకంబాడి మార్గంలోని యాపిల్‌బార్ సమీపంలో స్కూటర్ ఢీకొని ఆవుమృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. మంగళం పరిధిలోని బాలకృష్ణాపురానికి చెందిన గిరి పాలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఆవు సాయంత్రం 5.30గంటల సమయంలో బార్‌కి ఎదురుగా రోడ్డులో వస్తుండగా గుర్తుతెలియని స్కూటర్ ఢీకొని వెళ్లిపోయింది. దీంతో ఆ ఆవు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. యజమాని విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకుని చనిపోయిన ఆవుని అక్కడి నుంచి ఆటోలో తరలించారు.

## వ్యాసరచన పోటీల్లో గాయత్రి విద్యార్థుల ప్రతిభ

తిరుపతి(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్శిటీలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆ కళాశాల ఛైర్మన్ నీరజాక్షులు నాయుడు తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎస్వీయూలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కళాశాల విద్యార్థులు మధుసాయి, నవదీప్, హేమ బహుమతులు గెలుచుకున్నారని వెల్లడించారు. గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ కవిత, అధ్యాపక సిబ్బందితో కలిసి ఛైర్మన్ వారిని అభినందించారు.

## బీజేపీ 84వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా విజయభాస్కర్



ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బీజేపీ 84వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా విశ్రాంత ఉపాధ్యాయుడు విజయభాస్కర్ ఎంపికయ్యారు. స్థానిక సంస్థాగత ఎన్నికల్లో భాగంగా బీజేపీ గంగమ్మ గుడి శక్తి కేంద్ర ఇంచార్జి గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో 84వ బూత్ కమిటీ అధ్యక్ష ఎన్నిక మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా విజయభాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు తూర్పు మండలంలో ర్యాలీ నిర్వహించారు. విజయభాస్కర్ మాట్లాడుతూ... తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబుయాదవ్, చంద్రశేఖర్ రాయులు, విగ్రహాల కళ్యాణి, కస్పా పద్మనాభం, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



## దర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

**హుండీ(ఆదివారం నాటిది) ద్వారా: రూ.3.77 కోట్లు**

**సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,124**

**తలనీలాలు సమర్పించిన వారు: 24,069**

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఏడు గంగమ్మల ఫైల్ ఫొటోలు

శ్రీకాళహస్తి స్పెషల్

# ఏడు గంగమ్మల జాతర

గ్రామ దేవతలకు ఏటి ఉత్సవాన్ని జాతర మహోత్సవంగా నిర్వహించడం మన సంప్రదాయంలో ఒక భాగం. తమను గంగమ్మతల్లి చల్లంగా చూడాలన్న సంకల్పంతో జాతరను వైభవంగా నిర్వహిస్తారు. అమ్మకు అంబళ్లు పోయడమే కాకుండా వేషధారణలతో పాటు ఊరేగింపులు, పొంగళ్లతో పాటు జంతుబలులు నైవేద్యంగా సమర్పిస్తుంటారు. జిల్లా అంతటా వేసవిలోనే గంగ జాతరలు జరుగుతున్నాయి. అందునా ఒకే గంగమ్మను కొలువుదీర్చి మొక్కులు చెల్లించుకుంటారు. కానీ, జాతర విషయంలో శ్రీకాళహస్తికి ప్రత్యేకత ఉంది. ఇక్కడా ఒకేరోజు.. ఏడు గంగమ్మలను కొలువుదీర్చి జాతర నిర్వహిస్తారు. డిసెంబరు నెలలో.. చలికాలంలో జాతర నిర్వహించడం ఇక్కడి స్పెషాలిటీ. ఏడుగంగమ్మలైన అక్కా చెల్లెళ్లు శ్రీకాళహస్తిలో స్వయంభువుగా వెలిశారని పురాణగాథలు ప్రచారంలో ఉన్నాయి. వందలాది సంవత్సరాలుగా శ్రీకాళహస్తిలో ఏడు గంగల పండుగ నిర్వహిస్తున్నారు. చరిత్రాత్మకంగా పరిశీలిస్తే.. జమిందారులు, సంస్థానాదీశుల సమయంలో శ్రీకాళహస్తి గ్రామానికి ఏడువైపులా గంగరాళ్లు (తెట్టురాళ్లు) ఏర్పాటు చేశారని పెద్దలు చెబుతారు. ఆయా గంగమ్మల వద్ద ఆయా ప్రాంతాల్లో ఏటా అమ్మవార్లను కొలువుదీర్చడం.. ఒకేరోజు, ఒకేసారి ఊరేగింపు, నిమజ్జనం జరగడం తరతరాలుగా వస్తోంది. మరెక్కడా లేని విధంగా ఒకేసారి ఏడు గంగమ్మలకు జరిగే జాతర రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. శ్రీకాళహస్తిలో బుధవారం గంగజాతర వైభవోపేతంగా జరగనుంది. మంగళవారం రాత్రి అమ్మవార్లకు ఏడు గంగమ్మల ఆలయం వద్ద పూజలు నిర్వహించాక ముసుగు తొలగిస్తారు. బుధవారం వేకువజామున భక్తులకు దర్శనభాగ్యం కల్పించాక.. పెండ్లిమండపం వరకు ఏడుగంగమ్మలు ఒకరి వెనుక ఒకరుగా ఊరేగింపుగా వస్తారు. అక్కడ్నుంచి ఆయా ప్రాంతాలకు అమ్మవార్లను తీసుకొస్తారు. ఉదయం 9గంటల నుంచి భక్తులు ఏడు గంగమ్మలకు మొక్కులు చెల్లించుకుంటారు. మళ్లీ రాత్రికి ఏడుగురు అమ్మవార్లను ముత్యాలమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకచ్చి.. ఒక్కొక్కరికి వరుసగా ప్రత్యేక పూజలతో నిమజ్జన కార్యక్రమం చేయడంతో జాతర ముగుస్తుంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



పెండ్లిమండపం వద్ద విద్యుద్దీపాలంకరణ

### అమ్మవార్లు కొలువుదీరేది ఇక్కడే

మొదటి గంగమ్మ పెండ్లిమండపం వద్ద పొన్నాలమ్మగా కొలువుదీరతారు వరసగా.. బాబుఅగ్రహారం వద్ద అంకాళమ్మ, కొత్తపేట వద్ద భువనేశ్వరిగా, సన్నిధివీధిలో అంకమ్మగా, తేరువీధిలో నల్లగంగమ్మగా, జయరామరావువీధిలో కావమ్మగా, బేరివారి మండపం వద్ద ముత్యాలమ్మగా గంగమ్మలను ఆరాధిస్తారు.



గాంధీవీధిలో గంగమ్మ తెట్టురాయి

## వెటర్నరీలో తొలిసారిగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల సదస్సు

తిరుపతి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలిసారిగా తిరుపతిలోని వెటర్నరీ కళాశాల వేదికగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధన అంశాలకు సంబంధించి జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి, కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య తెలిపారు. బుధ, గురువారాలు రెండ్రోజులపాటు జరిగే ఈ సదస్సులో 'పశువుల ఆరోగ్యం-ఉత్పత్తి కోసం పరిష్కారాలు' ఆవిష్కరణపై వివిధ రాష్ట్రాలకు చెందిన 150 మంది పరిశోధకులు హాజరై తమ పరిశోధనా పత్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా వెటర్నరీసైన్స్ అప్లికేషన్లలో సాంకేతిక పురోగతి, క్లినికల్ ప్రొసీజర్స్-డిసీజ్ డయాగ్నోసిస్‌లో సాంకేతిక పురోగతి, డ్రగ్‌డిజైన్, కీమోథెరపీలో ప్రస్తుత పోకడలు, స్థిరమైన పశువుల ఉత్పత్తి, నిర్వహణ, బయోటెక్నాలజీ, స్టెమ్‌సెల్ పరిశోధనలో ప్రగతి, మల్టీ డిసిప్లినరీ రీసర్చ్.. అప్లికేషన్స్‌పై చర్చ, పరిశోధనల అంశాలపై లీడ్ పేపర్ ప్రజంటేషన్లు ఉంటాయన్నారు. ముఖ్యఅతిథిగా చెన్నైకి చెందిన ఫుడ్స్ అండ్ ఫీడ్‌మిల్స్ ఎండీ ప్రకాష్‌రావు, పాండిచ్చేరి వెటర్నరీ కళాశాల డీన్ డాక్టర్ షెజియన్, వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ జేవీ రమణ తదితరులు హాజరవుతారని తెలిపారు.

## శ్రీవారి సేవలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి



తిరుమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గంగారావు మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

## 13నుంచి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి పర్వదినం సందర్భంగా తమిళనాడు తిరువణ్ణామలైకి ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా తరపున ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఇంచార్జి డీపీటీవో జగదీష్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమిళ కార్తీకమాసంలో వచ్చే పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ముందురోజున శుక్రవారం రాత్రి తిరువణ్ణామల కొండపై పవిత్ర దీపం వెలిగించనున్నారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి ప్రత్యేక సర్వీసుల రవాణా ప్రారంభం కానుంది. శనివారం, ఆదివారం ఉదయం వరకు ఈ ప్రత్యేక బస్సులు సెంట్రల్ బస్సుస్టేషన్‌లో ప్లాట్‌ఫాం నెంబరు 27, 28 నుంచి బయల్దేరేలా చర్యలు తీసుకున్నారు. మొత్తం 115 బస్సులతో 232 ట్రిప్పులు తిప్పేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించారు. ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## 13న ఎడ్‌సెట్ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13వ తేదీన ఎడ్‌సెట్-2024 స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఎస్వీయూలోని అడ్మిషన్స్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు అడ్మిషన్లు ప్రారంభం కానున్నట్టు రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. ఆసక్తి కల్గిన వారు, ఎడ్‌సెట్ ర్యాంకు కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావచ్చని వర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ బాబు కోరారు.

## జర్మనీలో పద్మావతి వర్సిటీ వీసీ ఉమ

### ఘన స్వాగతం పలికిన జర్మన్ వర్సిటీల ప్రతినిధులు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ఉమ జర్మనీ చేరుకున్నారు. వారం రోజుల పర్యటనలో భాగంగా జర్మనీకి చేరుకున్న ఆమెకు అక్కడి యూనివర్సిటీలకు చెందిన అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయా వర్సిటీల ప్రతినిధులతో ఆమె సమావేశమై పద్మావతి వర్సిటీ ప్రగతిని వివరించారు. అక్కడి యూనివర్సిటీల నిర్వహణ, అభివృద్ధిని గురించి అడిగి తెలుసుకున్నారు. బోధన, పరిశోధన, విస్తరణ, విద్యార్థులు, ఉద్యోగుల మార్పిడి అంశంలో పరస్పర సహకారంపై చర్చించారు. పరస్పర సహకారానికి జర్మనీ యూనివర్సిటీలు సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నెల 14వ తేదీకి జర్మనీ పర్యటన ముగించుకుని వీసీ ఉమ తిరుపతికి చేరుకోనున్నారు.

'ఉపాధి'లో అవకతవకలపై

# ఫీల్డ్‌అసిస్టెంట్ సస్పెన్షన్

- పనులు ఒకరికి.. బిల్లు వేరొకరి ఖాతాలోకి..
- సామాజిక తనిఖీలో వెలుగుచూసిన వైనం
- రూ.27,983 రికవరీకి ఆదేశం

తిరుపతి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని సి.గొల్లపల్లెలో చేపట్టిన ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్‌అసిస్టెంట్ రమాదేవిని సస్పెండ్ చేశారు. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.8,72,11,175 లతో చేపట్టిన 1,358 పనులకు సంబంధించి గతనెల 6 నుంచి 18వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిర్వహించారు. స్టేట్ రీసోర్స్ పర్సన్ రవి ఆధ్వర్యంలో 12 మంది జిల్లా రిసోర్స్ పర్సన్లు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సభలో నివేదించారు. సి.గొల్లపల్లెలో గ్రామ ఉపసర్పంచ్ చెంగారెడ్డి ఫిర్యాదు మేరకు సామాజిక తనిఖీలో కూలీల నగదు చెల్లింపుల్లో అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో ఫీల్డ్‌అసిస్టెంట్‌ని సస్పెండ్ చేశారు. పనిచేసిన కూలీకి కాకుండా వేరొక వ్యక్తి ఖాతాకి రూ.27,983 నగదు చెల్లించిన విషయం నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే రూ. 27,983 రికవరీకి ఆదేశించారు. సి.మల్లవరం పంచాయతీలో చేపట్టిన సిమెంటు రోడ్డుపనుల్లో గుత్తేదారుడికి చెల్లించాల్సిన రూ.87,728 నగదు పీఆర్‌ఏఈ ఖాతాలో జమయ్యింది. దీన్ని పీఆర్ ఏఈ నుంచి తిరిగి గుత్తేదారుకి చెక్కురూపంలో అందజేశారు. అలాగే బ్రాహ్మణపట్టు, ఇతర పంచాయతీల్లో చేపట్టిన పనుల్లో కొలతల తేడాకి సంబంధించి తనిఖీలో రూ.2,28,517కి ఎస్‌ఆర్‌పీ వివరణ కోరారు. దీనిపై ఏపీవో మమతారాణి మాట్లాడుతూ వర్షాలతో పనులు పూర్తిచేయలేకపోయామని వివరించారు. డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సీవీ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ చిన్న పొరపాట్లు జరగకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ఎం.శివయ్య, ఎంపీపీ వేముల యశోద, జడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీడీవో రామచంద్ర, చంద్రగిరి క్లస్టర్ ఏపీడీ రెడ్డెప్ప, ఏపీవో టి.మమతారాణి, కె.రాంబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓటేరులో ఆక్రమణదారుల బరితెగింపు

- చీకటి పడ్డాక నిర్మాణ పనులు
- అడ్డుకున్న వీఆర్వోలపై దాడికి యత్నం





చీకటిలో చేపట్టిన నిర్మాణ పనులు - స్వర్ణముఖినదీపోరంబోకులో నిర్మాణం

తిరుపతిరూరల్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం.. నగరానికి అతిసమీపంలోని ఓటేరులో ఆక్రమణదారులు బరితెగిస్తున్నారు. అవిలాల లెక్కదాఖలా ఓటేరు పంచాయతీలోని సర్వేనంబరు362కి చెందిన స్వర్ణముఖినదిపోరంబోకులో చీకటిపడ్డాక నిర్మాణపనులు చేపడుతున్నారు. ఎవరైనా అడ్డుకుంటే తిరగబడేందుకు ఆకతాయిలను వెంటబెట్టుకుంటున్నారు. నిర్మాణ పనులకు మహిళా కూలీలని వినియోగించుకుంటున్నారు. వీరైతే అధికారులు ముందుకురావడానికి ధైర్యంచేయరన్న ఆలోచనతో ఈ పనిచేస్తున్నట్లు తెలిసింది. సిమెంటరాయి, ఇసుకని తరలించారక్కడికి. రాత్రివేళ పనులు చేపట్టారు. ఈ విషయం సోమవారం సాయంత్రం 7గంటలకు రూరల్ తహసీల్దార్ రామాంజులునాయక్‌కి సమాచారం అందింది ఆయన ఆదేశాలతో వీఆర్వోలు అక్కడికి వెళ్లేసరికి పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ స్థలంలో పనులు చేపట్టడంపై వీరు నిలదీశారు.పునాది వరకు ఏర్పాటు చేసిన సిమెంట్‌రాయిని కొంతవరకు తొలగించారు. కూలీల ద్వారా సమాచారం తెలుసుకున్న ఆక్రమణదారుడు 30మందికిపైగా ఆకతాయిలని తీసుకొచ్చి వీఆర్వోలపై దౌర్జన్యానికి దిగాడు. ఎలా తొలగిస్తారంటూ దాడికి యత్నించినట్లు తెలిసింది. మత్తులో ఉన్న ఆకతాయిలో కొందరు చిన్నపాటి ఆయుధాలు కూడా తీసుకొచ్చారని సమాచారం. దీంతో వీఆర్వోలు భయాందోళనకు గురయ్యారు.ఈ విషయం మంగళవారం వెలుగు చూసింది. ఆక్రమణల తొలగింపు సమయంలో పోలీసులని వెంటపంపేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈవిషయమై తహసీల్దార్‌తోనూ చర్చించారని తెలిసింది. కాగా, ఇదే స్థలానికి కొంత ముందుగా సర్వేనంబరు 360లో స్వర్ణముఖినదిపోరంబోకు స్థలంలో ఇటీవల ఆక్రమణదారులు రెండు రేకులషెడ్డులతో నిర్మాణం చేపట్టారు. ఆకతాయిలను పక్కన పెట్టుకుని ఈ పనులు చేపట్టినట్లు స్థానికులు చెబుతున్నారు.





మంగళవారం సాయంత్రం పొగమంచు కమ్మిన వేళ.. తిరుపతిలోని మంగళం రోడ్డు నుంచి లీలామహల్ సర్కిల్‌కు వెళ్లే మార్గంలో కనిపించిన దృశ్యం.

## తహసీల్దారుపై సస్పెన్షన్ వేటు

కడప కలెక్టరేట్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): విధుల్లో చేరకుండా, ఉద్యోగ నిబంధనలు ఉల్లంఘించి ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతారు చేసిన తహసీల్దారు యు.దస్తగిరయ్యను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.సాధారణ బదిలీల్లో భాగంగా యు.దస్తగిరయ్యను తిరుపతి జిల్లా నుంచి వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలోని కేఆర్‌ఆర్‌సీ తహశీల్దారుగా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. నిర్ణీత గడువులోగా ఆయన వచ్చి చేరలేదు. వెంటనే విధుల్లో చేరాలని ఫోన్ ద్వారా చెప్పడమే కాకుండా కలెక్టర్ మెమో కూడా జారీ చేశారు. అయినా విధుల్లో చేరలేదు. దీంతో తహసీల్దారు దస్తగిరయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## శిశుసంరక్షణ కేంద్రం నుంచి పరారైన బాలికలను పట్టుకున్న పోలీసులు

తడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు బాలిక శిశుసంరక్షణ కేంద్రం నుంచి పారిపోయిన ముగ్గురు బాలికలను తడ పోలీసులు పట్టుకున్నారు. వివిధ కేసుల్లో బాధితులుగా ఉన్న ఈ ముగ్గురు నెల్లూరు బాలిక శిశుసంరక్షణ కేంద్రంలో రక్షణ పొందుతున్నారు. మంగళవారం ఉదయం సంరక్షణ కేంద్రం నిర్వాహకుల కళ్లుకప్పి ఈ ముగ్గురు పరారయ్యారు.వీరు నెల్లూరు నుంచి మెమో రైలులో రాత్రి సమయంలో తడకు వచ్చారు. అక్కడ నుంచి బస్టాండ్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. ఆ సమయంలో సాధారణ తనిఖీలు చేస్తున్న పోలీసుల కంటపడ్డారు. వారి ప్రవర్తనపై అనుమానించిన పోలీసులు వారి వివరాలను అడగగా పొంతనలేని సమాధానం చెప్పడంతో వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడ విచారించగా నెల్లూరు నుంచి పారిపోయినట్లుగా గుర్తించారు. వెంటనే ఎస్‌ఐ కొండప్పనాయుడు నెల్లూరు సంరక్షణ కేంద్రానికి సమాచారం అందించారు. సదరు బాలికలను నెల్లూరు సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నారు.

## టీటీడీ ఉద్యోగులందరికీ నేమ్‌బ్యాడ్జీ

- ఫేస్‌బుక్ ఖాతాలో టీటీడీ చైర్మన్ వెల్లడి

తిరుమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో పనిచేసే ఉద్యోగులందరికీ త్వరలో నేమ్‌బ్యాడ్జీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నానని ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు తన ఫేస్‌బుక్ ఖాతా నుంచి వెల్లడించారు. కొందరు ఉద్యోగులు భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయన్నారు. భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తే చర్యలకు వెనకాడబోనని ఆ పోస్టులో స్పష్టంచేశారు. నేమ్‌బ్యాడ్జీ ఏర్పాటుతో భక్తులతో అమర్యాదగా వ్యవహరించిన వారిని సులువుగా గుర్తించే అవకాశం ఉంటుందని ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు వివరించారు. శ్రీవారి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో బాధ్యతాయుతంగా.. అంకితభావంతో ఉద్యోగులు ప్రవర్తించేందుకు ఈ బ్యాడ్జీ విధానం ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

## నేటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

తిరుపతి(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో అర్ధ వార్షిక పరీక్షలు సెల్ఫ్ అసెస్‌మెంట్ టర్మ్ మోడల్ పేపర్ (ఎస్ఏటీఎంపీ) టర్మ్-1 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్టు తెలిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎంబీయూలో ఫీజుల దోపిడీ: ఏఐఎస్‌ఎఫ్

తిరుపతి(జీవకోన), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు యూనివర్సిటీలో ఫీజుల దోపిడీపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి డిమాండు చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఎంసెట్ కౌన్సెలింగ్ ద్వారా ఎంబీయూలో ఇంజనీరింగ్ సీట్లు పొందిన విద్యార్థుల నుంచి ఏటా అధికంగా రూ.20వేల ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై గతంలో ప్రభుత్వానికి చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఫీజుల విషయంపై ప్రశ్నిస్తే ఏఐఎస్‌ఎఫ్ నాయకులపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తాము బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై మంచు మనోజ్ ఇచ్చిన వివరణపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రెగ్యులేషన్ కమిటీతో విచారణ చేయించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే తల్లిదండ్రులను కలుపుకొని తాము ఎంబీయూ విశ్వవిద్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సోమవారం రంగంపేటలోని కళాశాల వద్దకు వెళ్లిన జర్నలిస్టులపై బౌన్సర్లు దాడికి పాల్పడటాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## 28న టీటీడీ బోర్డు సమావేశం

తిరుమల, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఈనెల 28వ తేదీన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరుగనుంది. చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని అజెండా అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. ఈ బోర్డుకు ఇది రెండో సమావేశం కావడంతో కొన్ని కీలకఅంశాలపై చర్చించనున్నట్టు సమాచారం.

## సీఎంను కలిసిన టీటీడీ అదనపు ఈవో



తిరుమల, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మంగళవారం సీఎం చంద్రబాబును విజయవాడలో కలిశారు. నాలుగు నెలల్లో తిరుమలలో చేపట్టిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించిన సౌకర్యాలు, చేసిన మార్పులు, చేర్పులను వివరించారు. క్యూలైన్ల నిర్వహణ, భక్తులకు దర్శన నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలను తెలిపారు. అన్నప్రసాదాలు, లడ్డూల నాణ్యత పెంపుపై మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, తిరుపతి పవిత్రతను కాపాడేలా వ్యవహరించాలని సీఎం సూచించారు.

# పుత్తూరు వార్తలు

## పెండింగ్‌లో 'అత్యవసర' బిల్లులు



పుత్తూరు అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో గత కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి హయాంలో సాధారణ ఎన్నికల ముందు చేపట్టిన అత్యవసర పనులకు సంబంధించిన బిల్లులను పెండింగ్‌లో పెట్టారు. విచ్చలవిడిగా అవినీతి అక్రమాలు జరిగాయన్న విమర్శలతోనే పెండింగ్ పెట్టినట్టు సమాచారం. మున్సిపల్ మార్కెట్ సముదాయం, ప్రైవేటు బస్టాండ్, మార్కెట్ వేలం నిధులను వసూలు చేయకపోవడం, శానిటరీ విభాగం ఆధ్వర్యంలో కొనుగోళ్లలో అవినీతికి పాల్పడినట్లు విమర్శలున్నాయి. ఈ క్రమంలో ప్రస్తుత కమిషనర్ మంజునాథ్ గౌడ్ పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను పెండింగ్‌లో పెట్టారు. మోటర్ల ఏర్పాటు, బోర్లు, కాలువల నిర్మాణాలు చేపట్టినట్లు ఎంబుక్‌లలో నమోదు చేశారు. వాస్తవానికి పనులు చేశారా, లేదా అన్న కోణంలో క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వ పాలనలో కేఎల్‌ఎన్ రెడ్డి, వెంకటరమణారెడ్డి కమిషనర్లుగా వ్యవహరించారు. దాదాపు రూ. కోటి విలువైన సామగ్రిని అనధికారికంగా విక్రయించేశారనే ఆరోపణలున్నాయి.

## సాగు నీటి సంఘాలకు ఎన్నికలు

వడమాలపేట, డిసెంబర్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలో 11 చెరువుల నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ మురళి మోహన్ చెప్పారు. మండలంలో కల్లూరు, టీసీ అగ్రహారం, తట్నేరి, కదిరిమంగళం, పాదిరేడు, కాయం, పూడి, తిరుమణ్యం, పత్తిపుత్తూరు, వెదళ్ల చెరువు, పిడతల కోన చెరువులకు ఈనెల 14న చెరువుల నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని వెదళ్ల చెరువు నీటి సంఘం ఎన్నికలు వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాలలో, తట్నేరి నీటి సంఘం ఎన్నికలు లక్ష్మమ్మ కండ్రిగలో జరుగుతాయన్నారు. మిగిలిన 9 చెరువుల నీటి సంఘాల ఎన్నికలు ఆయా చెరువులు ఉన్న పంచాయితీ కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతాయన్నారు. ప్రతి చెరువుకు సంబంధించి ఓటర్లు ఆరుగురు సభ్యులను ఎన్నుకోవాలని, ఆరుగురు సభ్యులు అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని చెప్పారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామని, ఆయా చెరువుల నీటి సంఘాల ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల అధికారులను త్వరలో ప్రభుత్వం నియమిస్తున్నట్లు చెప్పారు.

**పుత్తూరు:** మండలంలోని ఏడు చెరువు ఆయకట్టుదారుల సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ ఇస్తామని ఇరిగేషన్ ఏఈ తెలిపారు. ఎన్నికలు ఈ నెల 14న ఆయా గ్రామ సచివాలయాల్లో జరుగుతాయన్నారు. ఎన్నికలు జరిగే గూళూరు చెరువు సంఘంలో 666 మంది ఓటర్లు, చిన్నరాజుకుప్పంలో 152, కెబీఆర్‌పురంలో 292, నేసనూరు 340, నందిమంగళం 211, వీరప్పరెడ్డిపాలెం 124, పుత్తూరు 409 మంది ఓటర్లు వున్నారని తెలిపారు. ప్రతి సంఘం పరిధిలో ఆరు సెగ్మెంట్లకు ఆరుగురు ప్రతినిధులను ఎన్నుకోవాల్సి ఉందన్నారు. ఎన్నికైన డైరెక్టర్లు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారన్నారు.

## శిథిలమైన నీటి ట్యాంకును తొలగించండి

పుత్తూరు టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తడుకు పంచాయితీ ఎగువ గూళూరు దళితవాడలో శిథిలావస్థకు చేరుకున్న తాగునీటి ట్యాంకును తొలగించాలని గ్రామస్తులు సోమవారం ఎంపీడీవోకు రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని చుట్టుపక్కల ఉన్న స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

## నేతమ్స్ షుగర్స్ పరిధిలోని మండలాలు ఎస్‌ఎన్‌జేకి మళ్లింపు

నగరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిండ్ర మండలంలో ఉన్న నేతమ్స్ షుగర్స్ పరిధిలోని మండలాలను ఎస్‌ఎన్‌జే చక్కెర కర్మాగార జోన్ పరిధిలోకి మళ్లిస్తూ రాష్ట్ర కేన్ కమిషనర్ తాత్కాలిక ఉత్తర్వులు ఇచ్చినట్లు చిత్తూరు జిల్లా అసిస్టెంట్ కేన్ కమిషనర్ జాన్‌విక్టర్ తెలిపారు. మంగళవారం నగరిలో జరిగిన నగరి డివిజన్ చెరకు రైతుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. నేతమ్స్ చక్కెర కర్మాగారం 2020 నుంచి మూసివేయడంతో దీని పరిధిలోని నగరి, నిండ్ర, విజయపురం, పుత్తూరు, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, కేవీబీపురం రైతుల కోరిక మేరకు వీరిని ఎస్ఆర్‌పురం మండలంలోని నెలవాయి వద్ద ఉన్న ఎస్‌ఎన్‌జే కర్మాగారం పరిధిలోకి చేర్చామన్నారు. ఈ ప్రాంతంలోని రైతులందరూ ఈవిషయాన్ని గమనించి ఏజెంట్లను ఆశ్రయించకుండా వరుస క్రమంలో ఎస్‌ఎన్‌జే కర్మాగారానికి చెరకును తరలించి లబ్ధి పొందవచ్చన్నారు. ఎస్‌ఎన్‌జే వైస్ ప్రెసిడెంట్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. రైతులకు అన్ని సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. చెరకు విత్తనం, కలుపు మందులు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు రాయితీపై ఇస్తామన్నారు. అడ్వయిజర్ ఎం.కృష్ణన్, ఏజీఎం వరదరాజన్, ఏవోలు చంద్రయ్య, రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

## రాత్రైనా పని చేస్తున్న స్త్రీశక్తి భవన్?




వరదయ్యపాళెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్ మంగళవారం రాత్రి 9 దాటుతున్నా తెరిచే ఉంది. ఈ కార్యాలయంలో ఎంతో విలువైన సామాగ్రి ఉంది. అయితే తమకెందుకు అన్న రీతిలో అధికారులు, సిబ్బంది తీరు ఉంది. పగలు విధులు నిర్వహించాల్సిన ఓ ఉద్యోగి రాత్రివేళ పనిచేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పగలు ఏం చేస్తున్నారు.. ఇంత రాత్రివేళ విధులు ఎందుకు చేయాల్సి వచ్చిందో అని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇంత రాత్రి వేళ కార్యాలయం తెరచి ఉంచడంపై విచారించాలని కోరుతున్నారు. దీనిపై ఏపీఎంను వివరణ కోరగా పెండింగ్ ఫైళ్లు చూస్తున్నట్టు చెప్పుకొచ్చాడు.

## స్నేహితుల మధ్య రభస: పరస్పరం దాడి



చికిత్స పొందుతున్న వంశీ, షుకూర్

శ్రీకాళహస్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇద్దరు స్నేహితుల మధ్య మాటామాటా పెరగడంతో గొడవకు దారి తీసింది. పరస్పరం ఇద్దరు దాడులు చేసుకోవడంతో గాయపడ్డారు. శ్రీకాళహస్తి పట్టణం హరహరబావి వీధికి చెందిన వంశీ, షుకూర్ పక్కపక్కనే ఇళ్లల్లో నివసిస్తుంటారు. అలాగే ఇద్దరు రేణిగుంట సమీపంలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తుంటారు. ఇద్దరు చాలా కాలంగా మిత్రులు. ఇటీవల మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. మంగళవారం రాత్రి 9.30గంటల సమయంలో వీధిలో ఇద్దరు ఎదురుపడ్డారు. మాటమాటా పెరగడంతో ఒకరిపైఒకరు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో గాయపడిన ఇద్దరిని స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. హరహరబావి వద్ద రెండు వర్గాల గొడవగా మారే ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు.

## గుంతలమయంగా పుత్తూరు రోడ్డు



రేణిగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుత్తూరు రోడ్డు గుంతలమయమవడంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. పాతచెక్‌పోస్టు నుంచి పుత్తూరు వైపు వెళ్లే మార్గం రోడ్డు గుంతలమయంగా తయారైంది. వాహన చోదకులు ఈ గుంత వద్ద అదుపుతప్పి కిందపడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

# గూడూరు

## సూళ్లూరుపేట/వెంకటగిరి

## రోడ్డు ప్రమాదంలో పెయింటర్ మృతి

సూళ్లూరుపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని వట్రపాలెం వద్ద మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని అనంతసాగరానికి చెందిన దాసరి శ్రీనివాసులు(52) మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. అనంతసాగరానికి చెందిన శ్రీనివాసరావు సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లో పెయింటింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం జాతీయ రహదారి నుంచి వట్రపాలెం వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రెండు బైక్‌ల ఢీ: ఒకరికి గాయాలు



గాయపడ్డ చెంగల్‌రాయులు

తడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక మునిరెడ్డి కాలనీకి చెందిన చెంగల్‌రాయులు మంగళవారం ఉదయం బోడిలింగాలపాడు వద్ద ఉన్న శివాలయానికి బైక్‌పై బయలుదేరాడు. బోడిలింగాలపాడు వద్ద మలుపు తిరుగుతుండగా మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో చెంగల్‌రాయులుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.



పాతబస్టాండ్ వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు - ఆటోలో వెనక భాగంలో ప్రయాణం

## పల్లెబాట పట్టని ఆర్టీసీ..!

### ఆటోలు, మాక్సీ క్యాబ్‌లను ఆశ్రయిస్తున్న గ్రామీణులు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి డిపో పరిధిలో నడిచే ఆర్టీసీ బస్సులు గ్రామాలకు దూరమవుతున్నాయి. నష్టాలను సాకుగా చూపుతూ... ఆటోలపై నెపం నెట్టి గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులను నడపడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వెంకటగిరి డిపో పరిధిలో మొత్తం 63 సర్వీసులు నడుస్తున్నాయి. ఇందులో పల్లె వెలుగు బస్సులు నామమాత్రంగా ఉన్నాయి. వెంకటగిరి నుంచి జీకే పల్లి, చిన్నపురెడ్డిపల్లి, చినన్నపేట గ్రామాల మీదుగా మాత్రమే శ్రీకాళహస్తికి పల్లెవెలుగు బస్సు నడుపుతున్నారు. మిగిలిన గ్రామీణ మార్గాల్లో ఎక్కడా బస్సు సౌకర్యం లేదు. నష్టాల్లో ఆర్టీసీని ఆదుకునేందుకు గత ప్రభుత్వంలో విలీనం చేసినట్లు ఆర్భాటంగా ప్రకటించారు. దీంతో ఆర్టీసీ నష్టాల నుంచి బయటపడి గ్రామాలకు బస్సు సౌకర్యం మెరుగు పడుతుందని ప్రజలు ఆశించారు. అయితే ఇందుకు విరుద్ధంగా నష్టాలను సాకుగా చూపి బస్సు ఛార్జీలు పెంచి ప్రజలపై అదనంగా భారం మోపారు. అంతేకాకుండా ఆయా మార్గాల్లో ఆదాయం రావడం లేదని, డిపోలో అవసరమైన మేర బస్సులు లేవని, రహదారులు సక్రమంగా లేవన్న కారణాలతో సర్వీసులను నిలిపివేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు లేక ప్రజలు, విద్యార్థులు ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లపై ఆధారపడుతున్నారు. ఆటోల్లో ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా... కిక్కిరిసిన వాహనాల్లో రాకపోకలు సాగించాల్సిన వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**ఆదాయం లేకపోవడంతోనే..**

గ్రామీణ ప్రాంతాల్లో ఆటోలు ఎక్కువగా ఉండడం, ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆదరించకపోవడంతో సర్వీసులను నిలిపేశాం. తిరుపతి, నెల్లూరు రూట్‌లలో బస్సులు ఏర్పాటు చేశాం. వెంకటగిరి - కడప మధ్య బస్సు సర్వీసు నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

- రామకృష్ణ, డిపో మేనేజరు

## పేదల భూములను ఆక్రమిస్తే చర్యలు: పాశం



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పక్కనే సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా తదితరులు

చిల్లకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదల భూములను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టును ప్రవేశపెట్టి పేదల భూములకు రక్షణ లేకుండా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదల భూములకు రక్షణ కల్పించేలా ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసిందన్నారు. ఎవరైనా పేద భూములను ఆక్రమిస్తే వారికి శిక్ష పడేలా, పేదల భూమును కాపాడేలా ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్-2024ను ప్రవేశపెట్టిందన్నారు. కాగా, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, సాగు చేసుకుంటున్న భూములను పట్టాలు మంజూరు చేయాలని రెవెన్యూ సదస్సులో పలువురు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, పచ్చా వెంకటేశ్వర్లు నాయుడు, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో గోపి, ర్‌వ పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆదిశంకరలో 'ఫియర్' చిత్ర బృందం సందడి

గూడూరు, డిసెంబరు 10: స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఫియర్ చిత్రబృందం సందడి చేసింది. హీరోయిన్ వేదిక మాట్లాడుతూ తమలాంటి కొత్తవారు నటిస్తున్న కొత్త చిత్రాలను ఆదరిస్తే మరింత మంది కొత్త నటీనటులు చిత్రసీమలోకి వస్తారన్నారు. సినీ నిర్మాత, దర్శకురాలు హరిత గోగినేని మాట్లాడుతూ ఫియర్ చిత్రం ఈనెల 14వ తేదీన విడుదల అవుతుందన్నారు. అన్ని వర్గాలను అలరించేలా నిర్మించిన ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలని కోరారు. విద్యార్థులు చిత్ర బృందంతో సెల్ఫీలు దిగారు. చిత్ర బృంద సభ్యులు సొలోమాన్, అభి, సాహితి, కళాశాల ప్రిన్సిపాల్ వేణుమాదవ్, రాజయ్య రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న హీరోయిన్ వేదిక



## మానవ హక్కులపై అవగాహన




కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి అనుషా

వెంకటగిరి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జడ్జి అనుషా అన్నారు. మంగళవారం స్థానిక విశ్వోదయ డిగ్రీ కళాశాలలో మానవ హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత చట్టాల్లో ప్రతి ఒక్కరికీ హక్కులు కల్పించడం జరిగిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజా కుమారి, అనుపమ, రాజారావు, ఏఎస్ఐ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే విజయశ్రీ



తడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కలిశారు. మంగళ వారం అమరావతిలో రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే టీడీపీ అభ్య ర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య మంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కలిసి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు చేయాలని కోరారు. సూళ్లూరుపేట వేదికగా జరప తలపెట్టిన పక్షుల పండుగకు నిధులు కేటాయించి అట్టహాసంగా జరి గేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

## పోలేరమ్మకు అంబళ్ల సమర్పణ



అంబళ్లను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న మహిళలు

కోట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో గ్రామదేవతల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పోలేరమ్మ జాతర జరిగింది. అమ్మవారికి బతుకు ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాల నడుమ మట్టి కుండలతో చిట్టేడు పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. అనంతరం గ్రామానికి చెందిన మహిళలు తప్పెట్లతో అంబళ్లను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు.

## పొలం పిలుస్తోంది

గూడూరు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విందూరు, మిటాత్మకూరు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏవో రమేష్ మాట్లాడుతూ రైతులు అవసరమైన మేరకే రసాయన ఎరువులు, పురుగు మందులను వాడాలన్నారు. అధికంగా రసాయన ఎరువులను వినియోగించడం ద్వారా భూమి సారాన్ని కోల్పోతుందన్నారు. కార్యక్రమంలో ప్రసన్న, దివ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులు

కోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ అన్నారు. కోటలోని పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దారు జయజయరావు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం జలీల్ అహ్మద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పక్కా ప్రణాళికతో రైతుల భూములను కొట్టేసేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చిందన్నారు. ఆ చట్టాన్ని సీఎం చంద్రబాబునాయుడు రద్దుచేసి రైతుల పక్షాన నిలబడ్డారని అన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, తెలుగు రైతు కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేష్, షంషుద్దీన్, మోబిన్, అనిల్, సర్పంచ్ వెంకటరమణమ్మ, డిప్యూటీ తహసీల్దారు రహమతుల్లాఖాన్, ఆర్ఐ మధులత, వీఆర్వో రమణయ్య పాల్గొన్నారు.

బాలాయపల్లి(ఆంధ్రజ్యోతి) మండలంలోని మన్నూరు, పల్లిపాడు గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పాసు పుస్తకాలు, 1బీ నమోదు కోసం 39, పక్కా గృహాల మంజూరు కోసం 15 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ బట్టేపాటి మురళీ మోహన్ రెడ్డి, ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ కె.తారకరామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లూరు సచివాలయంలో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించగా 9మంది తమ భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషిబాయి, వీఆర్వోలు రమేష్, కల్యాణి, మొబీనా, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, మారాబత్తిన గురవయ్య, గురవారెడ్డి, రవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెలగలపొన్నూరు, సుద్దమడుగుతాగేలి గ్రామాల్లో తహసీల్దార్ ఎస్‌వీ.నరసింహారావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 45 అర్జీలు వచ్చాయని, ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వాకాడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిరాయదొరువు పంచాయతీ చినతోట గ్రామంలో తహసీల్దారు రామయ్య రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 27 వినతులు వచ్చాయని, పూర్తిస్థాయిలో విచారించి పరిష్కరిస్తామని తహసీల్దారు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సందీప్, ఆర్ఐ అఖిల్, టీడీపీ నాయకులు మామిడి గోవిందయ్య, ఐయ్యల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాగబాబుకు మంత్రి పదవి ప్రకటనపై సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న జనసేన నాయకులు

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి నాగబాబుకు రాష్ట్ర కేబినేట్‌లోకి తీసుకుంటామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించడం హర్షనీయమని ఉమ్మడి నెల్లూరుజిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మోహన్, నాగార్జున, వంశీకృష్ణ, సాయి, సనత్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## కాశీంగాడుకుప్పం పాఠశాలలో మానవ హక్కుల దినోత్సవం

తడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాశీంగాడుకుప్పం ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రఘురామయ్య, ఉపాధ్యాయులు సుధాకర్, పద్మజారాణి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

నాయుడుపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలను ప్రముఖ వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లోని 11 మండలాల ఏపీఎంలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాలను బలోపేతం చేయడంతో బ్యాంక్ రుణాలను సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. తద్వారా బ్యాంక్ లింకేజీ ద్వారా వ్యాపారాలకు గరిష్ఠ రుణాలు మంజూరయ్యేలా కృషి చేయాలన్నారు. పొదుపు మహిళల ఉత్పత్తులను స్థానికంగా మాత్రమే కాకుండా ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు చేస్తే ఆర్థికంగా బలోపేతం అవుతారని అన్నారు. కార్యక్రమంలో ఏపీడీ ప్రభావతి, ఏరియా కోఆర్డినేటర్ మురళి, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

## పౌరులందరికీ సమాన హక్కులు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జీ షమ్మీపర్వీన్ సుల్తానా బేగం

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పౌరులందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని ఏడవ అదనపు జిల్లా జడ్జీ షమ్మీపర్వీన్ సుల్తానా బేగం అన్నారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులకు ఎవరైనా భంగం కల్పిస్తే న్యాయపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ సమానత్వాన్ని పాటిస్తూ హక్కులను పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు సులోచనారాణి, లోకనాధం, లక్ష్మీనారాయణ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గూడూరు కోర్టు ఆవరణలో ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏడవ అదనపు జిల్లా జడ్జీ షమ్మీపర్వీన్ సుల్తానాబేగం అన్నారు. మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా రాజీమార్గంలో కేసులను సత్వరం పరిష్కరించుకోవచ్చునన్నారు. దీని వల్ల ఖర్చు, సమయం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు సులోచనా రాణి, లోకనాధం, శంకరయ్య లక్ష్మీనారాయణ, డీఎస్పీ రమణకుమార్, వివిధ శాఖల అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## క్రికెట్ క్రీడాకారుడికి అభినందన



లీలావికాస్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అండర్-14 రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపికైన క్రీడాకారుడు బెల్లంకొండ లీలా వికాస్‌ను నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ అభినందించారు. మంగళవారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న లీలావికాస్ విజయనగరంలో జరగనున్న అండర్-14 రాష్ట్ర క్రికెట్ జట్టు ప్రాబబుల్స్ మ్యాచ్‌లో పాల్గొననున్నాడని తెలిపారు. ఈ మ్యాచ్‌లో ప్రతిభ కనబరిస్తే రాష్ట్ర జట్టులో అవకాశం దక్కుతుందని, లీలావికాస్ ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఏవో పద్మయ్య, పీఈటీ చైతన్య, భవాని తదితరులు పాల్గొన్నారు.

## కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ




విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసమూర్తి

కోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాలభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించారు. ఈ నెల 8వ తేదీన పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే ఓపన్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో బాలభారతి ఉన్నత పాఠశాలకు చెందిన వై.జయదీప్, ఇ.జశ్వంత్ బంగారు పతకాలు సాధించగా వై.మోక్షదీప్ వెండి, పి. పవన్‌కల్యాణ్, ఎన్. జశ్వంత్ క్యాంస పతకాలు సాధించారు. మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ కర్రా శ్రీనివాస మూర్తి, వెంకటరమణమూర్తి షీల్డ్‌లు, మెమోంటోలతో విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో విద్యానగర్‌లోని విద్యావికాష్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. పాఠశాలకు చెందిన హేమలత, అక్షర వెండి పతకాలు సాధించగా, ఐ.ఎస్మిత క్యాంస పతకం సాధించింది. విద్యార్థులను కరస్పాండెంట్ మధుసూదన్‌రావు, కరాటే మాస్టర్ హరిబాబు షీల్డ్‌లు, మెమోంటోలతో అభినందించారు.

## పాఠాలు బోధించకుండా పరీక్షలెలా రాయాలి?

### గిరిజన గురుకులం విద్యార్థుల ఆవేదన

రేణిగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాఠాలు బోధించకుండా పరీక్షలెలా రాయలని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. తిరుపతి విమానాశ్రయం సమీపంలో ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాల నడుస్తోంది. ఈ పాఠశాలలో ఐదో తరగతి నుంచి టెన్త్ వరకు సుమారు 369 మంది విద్యార్థులున్నారు. అయితే అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు తమ జీతాలు పెంచాలని గతనెల 19వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న 15మంది ఉపాధ్యాయులు సమ్మెలో పాల్గొంటున్నారు. దీంతో ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే అన్ని తరగతులకు బోధించాల్సిన పరిస్థితి. ప్రధానంగా గణితం, సైన్స్ సబ్జెక్టుల బోధన నిలిచిపోయింది. సిలబస్ పూర్తి కాకుండా మరో మూడు నెలల్లో జరిగే పబ్లిక్ పరీక్షలెలా రాయాలని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై గిరిజన ఉపాధ్యాయ అసోసియేషన్ నాయకుడు పురుషోత్తంను వివరణ కోరగా.. తామంతా 15ఏళ్లుగా అవుట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్నా ఇప్పటికీ 2010 లెక్క ప్రకారమే జీతాలు చెల్లిస్తున్నారని తెలిపారు. తమ పరిధిలోనే ఉన్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు అధిక మొత్తంలో జీతాలు చెల్లిస్తున్నారని చెప్పారు. తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా 1650 మంది సమ్మెలో పాల్గొంటున్నారని తెలిపారు. తమ సమ్మెవల్ల విద్యార్థులకు బోధన నిలిచిపోయిన విషయమై ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

## సూరప్పకశంలో 17 మంది పింఛను అనర్హుల గుర్తింపు

రేణిగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరప్పకశం పంచాయతీలో 17 మంది పింఛను లబ్ధిదారులను అనర్హులుగా గుర్తించినట్లు డీఆర్డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. గత వైసీపీ పాలనలో పింఛను లబ్ధిదారులుగా చేర్చిన వారిని గుర్తించడానికి ప్రతి జిల్లాలో ఒక మండలంలో విచారణకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశించింది. ఈక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ రేణిగుంట మండలంలోని సూరప్పకశం పంచాయతీలో విచారణకు ఆదేశించారు. ఈ మేరకు డీఆర్డీఏ పీడీ ఆధ్వర్యంలో ఇతర ప్రాంతాలకు చెందిన 18 మంది సచివాలయ సిబ్బంది తొమ్మిది బృందాలుగా ఏర్పడి రెండు రోజులపాటు విచారణ జరిపారు. ఈ విచారణలో 17 మంది అనర్హులున్నట్టు గుర్తించారు. చిన్న పంచాయతీలోనే 17 మంది అనర్హులుంటే మండలం మొత్తం ఎంతమంది ఉంటారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## బస్సులు ఆపండి సారూ...!

### విద్యార్థుల వేడుకోలు

ఏర్పేడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఆర్డినరీ, పల్లెవెలుగు ఆర్టీసీ బస్సులను ఆపడంలేదు. దీంతో సమయానికి విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారు. అంతేకాకుండా సాయంత్రం పూట పాఠశాల వదిలిన తరువాత తిరిగి సమయానికి ఇంటికి చేరుకోలేకపోతున్నారు. ముఖ్యంగా విద్యార్థినులు సాయంత్రం పూట ఇబ్బంది పడుతున్నారు. ఏర్పేడు నుంచి శ్రీకాళహస్తి పట్టణంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఎంతోమంది విద్యార్థులు వెళుతారు. అయితే వారు తిరిగి ఇంటికి చేరుకోవడానికి మంగళవారం సాయంత్రం శ్రీకాళహస్తి పట్టణంలోని స్వర్ణముఖి వంతెన వద్ద ఉన్న పాతబస్టాండు, ఎన్టీఆర్ పార్కుల వద్ద వేచ్చి ఉన్న విద్యార్థులను 5.20, 5.30, 5.45 శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వెళ్లే ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులు ఆపకుండా వెళ్లిపోయాయి. ఈ రకంగా ప్రతిరోజు ఇదే తరహాలో విద్యార్థులను వదలి వెళ్లిపోతున్నారు. దీంతో డ్రైవర్లు, కండక్టర్లను అడిగితే దురుసుగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిపో మేనేజరు స్పందించి తిరుపతి నుంచి శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తి నుంచి తిరపతికి వెళ్లే ఆర్టీసీ బస్సులను విద్యార్థులకు సౌకర్యంగా ఎక్కడ ఆపితే అక్కడ ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## వైద్యసేవల్లో నిర్లక్ష్యం తగదు: జనసేన


బాలింతతో మాట్లాడుతున్న కోట వినుత

శ్రీకాళహస్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వైద్యసేవల విషయంలో ప్రభుత్వాస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత అన్నారు. ప్రభుత్వాస్పత్రిని మంగళవారం ఆమె పరిశీలించారు. రక్తం నిల్వ లేక పలువురు గర్భిణులను చివరి నిమిషంలో తిరుపతికి రెఫర్ చేయడంపై మంగళవారం మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన వినుత ప్రభుత్వాస్పత్రిని పరిశీలించారు. ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో 'ఓపీ'కకు పరీక్ష

### వైద్యసిబ్బంది నిర్లక్ష్యంపై అభ్యంతరం

శ్రీకాళహస్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు ఓపీ రసీదు తీసుకునేందుకు ఓపిక పరీక్ష తప్పలేదు. ప్రభుత్వాస్పత్రి ఓపీ విభాగంలో పేర్లు నమోదు చేసుకుని రసీదులు ఇచ్చేందుకు సాధారణ వేళల్లో ఇద్దరు, రద్దీ సమయంలో ముగ్గురు సిబ్బంది ఉండాలి. కానీ మంగళవారం ఒకరిని మాత్రమే ఓపీలో చీటీలు ఇచ్చేందుకు కేటాయించారు. దీంతో వైద్యం కోసం వచ్చిన రోగులు అధిక సమయంలో క్యూలో నిరీక్షించాల్సి వచ్చింది. ఈ సమయంలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఓ బీజేపీ నేత కుక్కకాటుకు గురవడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చాడు. ఓపీ లైన్‌లో కాసేపు నిరీక్షించాడు. చాలా నెమ్మదిగా కదులుతుండటంతో ఒకరే సిబ్బంది ఎందుకు ఉన్నారని వారిని ప్రశ్నించారు. అక్కడ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో క్యూలైన్‌లో అది విన్న మిగతా రోగులంతా ఒకసారిగా గగ్గోలు పెట్టారు. నిర్లక్ష్యంగా వ్యవహరించమే కాకుండా దురుసు సమాధానాలు చెబుతారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రోగుల ఓపికను పరీక్షించవద్దంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## భార్య ఆత్మహత్య కేసులో భర్తకు రిమాండ్

రేణిగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భార్య ఆత్మహత్య కేసులో భర్తకు రిమాండ్ విధించినట్లు గాజులమండ్యం పోలీసులు మంగళవారం తెలిపారు. గాజులమండ్యం పరిధిలో రెండు రోజుల క్రితం భర్త వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో భార్య ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈక్రమంలో భర్త సెల్వంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి మేనమామ నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సెల్వంను న్యాయస్థానం ముందు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

## స్కూటర్ ఢీకొని ఒకరి మృతి

రేణిగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్కూటర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి ఎగువ మల్లవరం వద్ద జరిగింది. కడప జిల్లాకు చెందిన సుబ్బన్న(60) ఎగువ మల్లవరం హోటల్‌లో పనిచేస్తున్నాడు. సుబ్బన్న రోడ్డు దాటుతుండగా అటువైపుగా మోటరు సైకిల్‌పై వస్తున్న కృష్ణాపురానికి చెందిన కృష్ణయ్య ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సుబ్బన్న అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణయ్య గాయపడడంతో స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సుబ్బన్న మృతదేహాన్ని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అన్నమయ్య శోభాయాత్రను జయప్రదం చేయండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కళాక్షేత్ర పీఠం నిర్వాహకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అఖండ హరినామ సంకీర్తన, భజనలను టీటీడీ అనుబంధ ఆలయాల్లో నిర్వహించే విధంగా కృషి చేద్దామని కళాక్షేత్ర పీఠం కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలన భవన ఆవరణలో మంగళవారం అన్నమయ్య కళాక్షేత్ర పునరంకిత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ... బుధవారం గీతా జయంతి సందర్భంగా అన్నమయ్య కళాక్షేత్ర పునరంకిత శోభాయాత్రను జానపద, భజన, కోలాటం, చెక్క భజన, హరికథ, బుర్రకథ, వీధి నాటక, డప్పు కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా తిరుమల కొండపై కూల్చేసిన అన్నమయ్య ఇంటిని పునర్నిర్మించాలన్నారు. ఈనెల 11న ఉదయం 9గంటలకు తిరుపతి నగరం టీటీఆర్ కాలనీ 12వ లైన్ అన్నమయ్య కళాక్షేత్రం పీఠం నుంచి శోభాయాత్ర టీటీడీ పరిపాలన భవనం వరకు ఉంటుందని తెలిపారు. అదే విధంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో అఖండ శివనామ సంకీర్తన నిత్య భజనలు నిర్వహించాలని కోరారు. సుధాకర్, రమణమ్మ, వంశీకృష్ణ, రాజారెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ శాశ్వత సభ్యత్వం



శ్రీకాళహస్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రీకాళహస్తి పట్టణాధ్యక్షుడు విజయకుమార్ మంగళవారం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. రూ.లక్ష చెల్లించి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రూ.100చెల్లించి టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినం

శ్రీకాళహస్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరసింహవర్మ మాట్లాడుతూ విద్యార్థులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులను, విధులను తెలుసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ గంగారాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి
# సత్యవేడు

# నేడు ఏడుగంగమ్మల జాతర

### శ్రీకాళహస్తికి ఉత్సవ శోభ ● సర్వత్రా సందడి


నగరివీధి, కొత్తపేటలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు- ఏడుగంగమ్మలకు అందించనున్న సారెకు పూజలు చేస్తున్న శ్రీకాళహస్తీశ్వరాలయ అర్చకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం ఏడుగంగమ్మల జాతర వేడుకగా జరగనుంది. ఈనెల 8న ఆదివారం అర్ధరాత్రి ఏడుగురు అమ్మవార్లు కొలువైన ప్రాంతాల్లో చాటింపుతో జాతరకు అంకురార్పణ జరిగింది. బుధవారం జరిగే జాతరకు మూడు రోజుల ముందు నుంచే అమ్మవారు కొలువు తీరే ప్రాంతాల వద్ద చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటయ్యాయి. బుధవారం వేకువజామున ఆయా ప్రాంతాల నుంచి అమ్మవారి ఉత్సవమూర్తులు సర్వాలంకార భూషితులై శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఏడుగంగమ్మల అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుంటాయి. మంగళవారం రాత్రి నుంచే యువత ఉత్సాహంగా చిందులు వేశారు. పట్టణంనుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు ఊరేగింపులో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులు పెద్దఎత్తున కొబ్బరికాయలు కొట్టారు. ఇక కుంభం నైవేద్యంగా సమర్పించి వేట పొంగళ్లు అర్పించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

**ట్రాఫిక్ మళ్లింపు...** మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సీఐ గోపి తెలిపారు. అన్ని భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతించకుండా బైపాస్ మీదుగా మళ్లిస్తామన్నారు. అమ్మవారి ఊరేగింపు సందర్భంగా ఆయా వీధుల్లో ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదన్నారు. అమ్మవార్లు కొలువు తీరే పరిసరాల్లో ఆటోలకు అనుమతి లేదన్నారు.

**ప్రత్యేక నిఘా ...**

భక్తుల భద్రత దృష్ట్యా పోలీసు అధికారులు భారీ బందోబస్తుతో పాటు ప్రత్యేక నిఘా పెట్టారు. జిల్లా నలుమూలల నుంచి పోలీసు అధికారులు, సిబ్బందిని రప్పించి ఒకరోజు ముందు నుంచే బందోబస్తు విధులు కేటాయించారు. ఊరగింపులో ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కొందరు పోలీసు సిబ్బంది సాధారణ దుస్తుల్లో నిఘా ఉంచారు. గతంలో జాతర సందర్భంగా జరిగిన గొడవలు, దాడులు ఈ యేడాది జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రౌడీ షీటర్లు, గతంలో గొడవలకు పాల్పడిన వారిని గుర్తించి మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం.


సారెతో సుధీర్, కోలా ఆనంద్ తదితరులు

### ఏడు గంగమ్మలకు ముక్కంటి సారె

శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో మంగళ వారం ఏడు గంగమ్మలకు ముక్కంటి సారెను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అందజేశా రు. ఆలయంలోని అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించిన అనంతరం ఎమ్మెల్యే దంప తులు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సారెను ఆలయంలోని శివయ్య గోపురం, రాజగోపురం నుంచి తేరువీధి, నెహ్రూవీధి, ముత్యాలమ్మ గుడివీధి మీదుగా ఏడుగంగమ్మలకు సారె సమర్పిం చారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకుడు చెంచయ్య నాయుడు పాల్గొనగా ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ఏడుగంగమ్మల ఆయంలో సారె అందిస్తున్న సుధీర్

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే సుధీర్


బోనుపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సు

శ్రీకాళహస్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలం బోనుపల్లిలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత వైసీపీ పాలనలో ఎదుర్కొన్న భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చున్నారు. భూ సమస్యలపై 49మంది ఫిర్యాదు చేశారు. ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు గాలి మురళినాయుడు తదితరులు పాల్గొన్నారు.

**ఏర్పేడు**: శ్మశానానికి వెళ్లే రోడ్డును రెవెన్యూ రికార్డుల్లో పొందుపరచాలని కాట్రకాయల గుంట గ్రామస్తులు రెవెన్యూ అధికారులను కోరారు. కాట్రకాయల గుంటలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. 28మంది రైతులు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. తహసీల్దారు భార్గవి, డీటీ రోజారమణి, ఆర్ఐ సుబ్రహ్మ ణ్యం, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవా రెడ్డి, పొన్నారావు, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

**కేవీబీపురం:** మండలంలోని ఆరె గ్రామంలో మంగళవారం తహసీల్దారు మునిరత్నం రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సు లో పెద్దఎత్తున అర్జీలను సమర్పించారు. ఆలయ భూముల ఆక్రమణ, పెద్ద చెరువు కాలువను ఆక్రమణ తదితరాలపై వినతులు వచ్చాయి. టీడీపీ నాయకుడు జయరామిరెడ్డి, మునస్వామియాదవ్, రామాంజులు నాయుడు, గోపీనాథ రెడ్డి, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, అటవీ, దేవదాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**బుచ్చినాయుడుకండ్రిగ:** తాము సాగు చేసుకుంటున్న భూములకు పాసుపుస్తకాలు ఇవ్వాలని మండలంలోని భవానీశంకరాపురంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సదస్సులో 55 అర్జీలు వచ్చినట్లు డీటీ చంద్రబాబు నాయుడు చెప్పారు. ఆర్ఐ నల్లయ్య, సర్వేయరు రాజ్‌కుమార్, సర్పంచు రాజయ్య, టీడీపీ నాయకులు చెంచురామ నాయుడు, శేఖర్ నాయుడు పాల్గొన్నారు.

## తల్లీబిడ్డా సంక్షేమమే లక్ష్యం

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తల్లీ బిడ్డా క్షేమం కోసం ఆరోగ్య శాఖ నిరంతరం పని చేస్తుందని ఆరోగ్య కేంద్రం డాక్టర్ దివాకర్ తెలిపారు. బీఎన్‌కండ్రిగ పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గర్భవతులకు అవగాహన కల్పించారు. ప్రతి గర్భిణి ఏఎన్ఎం ద్వారా వారి పేరును నమోదు చేసుకుని ఎంసీపీ కార్డును తీసుకుని ఆధార్, బ్యాంకు ఖాతా, ఫోన్ నెంబరు అనుసంధానిస్తే ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం ద్వారా రూ.5వేలు వారి ఖాతాలో జమ అవుతుందన్నారు. ఐరన్, కాల్షియం, విటమిన్ మాత్రలు వైద్యుల సలహా మేరకు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి నెల రక్త పరీక్షలు, సాధారణ స్కానింగ్‌లు చేసుకోవాలన్నారు. ఆకు కూరలు, పండ్లు, కూరగాయలు తదితర వాటిని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విద్యాసాగర్, సూపర్‌వైజర్ జ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

## వెంకటాపురం చెరువు పరిశీలన

రేణిగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెకంటాపురం చెరువును మంగళవారం తహసీల్దారు సురేష్‌బాబు పరిశీలించారు.చెరువులో మట్టిదిబ్బలను తొలగించాలని టీడీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చెరువును పరిశీలించారు. అంతకు ముందు జరిగిన రెవెన్యూ సదస్సులో ఐదు దరఖాస్తులు వచ్చాయి.

## కొనసాగుతున్న క్రాపికార్న్ కార్మికుల దీక్ష

సత్యవేడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలగుంట క్రాపికార్న్ జ్యూస్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న పలువురు కార్మికులను తొలగించడంపై బాధితులు చేపట్టిన దీక్ష కొనసాగుతోంది. ఫుడ్ ఫ్యాక్టరీ మెయిన్ గేటు వద్ద టీఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ రాము ఆధ్వర్యంలో కార్మికుల ఆందోళన కొనసాగుతోంది. దీక్షకు సీఐటీయూ మద్దతు తెలిపింది. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ... నష్టాల సాకుతో విధి విధానాలు పాటించకుండా కార్మికులను తొలగించడం భావ్యం కాదన్నారు.

## కోర్టు ఆవరణలో వాహనాల పార్కింగ్‌కు అనుమతి లేదు

సత్యవేడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి అనుమతి లేదని ఎస్ఐ రామస్వామి స్పష్టం చేశారు. కోర్టు ముందు వాహనాల పార్కింగ్‌వల్ల కోర్టు కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కోర్టు ఆవరణలో వాహనాలను పార్కింగ్ చేస్తే చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు.

## కౌశల్ క్విజ్ ప్రతిభా అన్వేషణ పోటీలు పేట విద్యార్థుల ప్రతిభ

ఏర్పేడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి కౌశల్ క్విజ్ ప్రతిభా అన్వేషణ పోటీల్లో పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులు తనుష్, లిఖిత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 29న విజయవాడలో జరిగే పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థులను, గైడ్ టీచర్లు దామోదరరెడ్డి, సెల్వరాజన్‌ను ప్రధానోపాధ్యాయురాలు సునీత అభినందించారు.

## 15మద్యం సీసాల స్వాధీనం ఒకరి అరెస్టు

వరదయ్యపాళెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పరిధిలోని రాళ్లకుప్పం సమీపంలో 15మద్యం సీసాలను పట్టుకున్నట్లు డీఎస్పీ పైడేశ్వరరావు తెలిపారు. మద్యం అమ్మకాలపై ఎస్పీ ఆదేశాలతో దృష్టి సారించారు. ఈక్రమంలో రాళ్లకుప్పం వద్ద మద్యం దుకాణంలో 15మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించేందుకు తీసుకెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ చెప్పారు.

## నేడు ఎమ్మెల్యే పర్యటన

వరదయ్యపాళెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలంలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఇల్లు సహా సర్వం కోల్పోయిన బాధితులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆర్థిక సాయం బుధవారం అందించనున్నారు. తహసీల్దారు కార్యాలయంలో ఉదయం 11గంటలకు చేరుకుని బాధితులకు సాయం అందించనున్నారు.


పిచ్చాటూరు, నాగలాపురంలలో సభ్యత్వ నమోదు

## సభ్యత్వ నమోదును విజయవంతం చేద్దాం : ఆదిమూలం

పిచ్చాటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అందరూ బాగుండాలన్నదే త జీవిత ఆశయమన్నారు. వందమందికి సభ్యత్వ రుసుం తాను చెల్లిస్తానని రూ.10వేలు అందించిన అడవి శంకరాపురం మాజీ సర్పంచు పద్దురాజును ఎమ్మెల్యే అభినందించారు. ఈ నెల 14న జరిగే సాగు నీటి సంఘ ఎన్నికల్లో రైతుల సంక్షేమం ఆకాంక్షించి అందుబాటులో ఉన్న వ్యక్తులను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని కోరారు. శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గం శేషంపేట వరకు తాత్కాలిక మరమ్మతులు చేయిస్తానని ముందుకొచ్చిన డెయిరీ ఎండీ మునిశేఖర్ నాయుడిని ఎమ్మెల్యే అభినందించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, పద్దురాజు, జయచంద్రనాయుడు, వాసురెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, రవి, భక్తారెడ్డి, చిన్న, రజని తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలోని 12 సంక్షేమ హాస్టళ్లలో మరమ్మతుల కోసం రూ. కోటీ 3 లక్షలా 52 వేలు మంజూరయ్యాయని చెప్పారు.

**నాగలాపురం:** నాగలాపురం- చిన్న పాండూరు వయా టీపీకోట రోడ్డు పనులు పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. నాగలాపురంలో జరిగిన టీడీపీ సభ్యత్వ నమోదుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి గ్రామంలో సభ్యత్వ నమోదును పెద్ద ఎత్తున చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపు నిచ్చారు. 14న జరుగనున్న సాగు నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ సానుభూతిపరుల విజయానికి కృషి చేయాలన్నారు. నాగలాపురం టౌన్‌లో మెయిన్ రోడ్డు తరచూ గుంతలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సెల్వకుమార్, మురళి, ఎస్ఎం సురేస్, తెన్నరసు, అన్బు, వెంకటేష్, వీఆర్వో నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## లింగ వివక్షను రూపుమాపుదాం


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది శ్రావణి

రేణిగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేటికీ కొనసాగుతున్న లింగ వివక్షను రూపుమాపుదామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణు వర్ధనమ్మ పిలుపునిచ్చారు. స్థానిక కళాశాలలో మానవహక్కుల దినోత్సవం సందర్భంగా హ్యూమన్ రైట్స్, సోషల్ డెవలప్‌మెంట్ సొసైటీ, విన్ సంస్థ సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది శ్రావణి మాట్లాడుతూ.. ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగితే న్యాయస్థానాన్ని ఆశ్రయించి పరిహారాన్ని పొందవచ్చని తెలిపారు. సమానత్వ హక్కు, స్వాతంత్ర్య హక్కుగా పేర్కొన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా లింగ వివక్ష రూపాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మీరా, కిరణ్‌కుమారి, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.